ANDHRAJYOTHY


ఆంధ్రజ్యోతి

5

శ్రీ పొట్టిశ్రీరాములు
నెల్లూరు
జిల్లా వార్తలు
సోమవారం 19 ఫిబ్రవరి 2024



సోమశిలలో 20.325 టీఎంసీల నీటి నిల్వ



అనంతసాగరం, ఫిబ్రవరి 18: సోమశిల పూర్తిసామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా, ఆదివారం నాటికి జలాశయంలో 20.325 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు. దిగువ డెల్టాకు 2,500, ఉత్తర కాలువకు 600, దక్షిణ కాలువకు 400 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నామని వారు తెలిపారు.

అడిగేదెవరు.. ఆపేదెవరు ?

- ఈసీ లేకుండా ఇసుక తవ్వకాలు
- ఐదు రీచ్‌లలో లోడేస్తున్న కాంట్రాక్టర్లు
- నిత్యం రాష్ట్రం దాటుతున్న వందల లారీలు
- కన్నెత్తి చూడని అధికార యంత్రాంగం
- ఎన్జీటీని తప్పుదారి పట్టిస్తున్న అధికారులు



బుచ్చి మండలం మినగల్లు రీచ్‌లో టిప్పర్‌కు ఇసుక లోడ్ చేస్తున్న ఎక్స్‌కవేటర్

నెల్లూరు, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ అనుమతులు లేవన్న భయమే లేదు.. నిబంధనలకు విరుద్ధంగా తవ్వుతున్నామన్న ఆలోచనే లేదు.. ఇతర రాష్ట్రాలకు తరలిస్తున్నామన్న ఆందోళన లేదు.. అధికార యంత్రాంగం పట్టుకుంటుందేమోనన్న భీతిత అసలే లేదు.. అడిగేదెవరు... ఆపేదెవరు...? అన్న రీతిలో జిల్లాలోని పెన్నానదిని లోడేస్తున్నారు. భారీ యంత్రాలతో చట్ట విరుద్ధంగా ఇసుకను అక్ర మంగా తవ్వుతున్నారు. నిత్యం వందలాది లారీలను పక్క ప్రాంతాలతోపాటు ఇతర రాష్ట్రాలకు తరలిస్తూ రూ.కోట్లను సొమ్ము చేసుకుంటున్నారు. సామాన్యుడు అనుమతి లేకుండా పిల్లకాలువలో తువ్వ ఇసుక తీసుకెళుతుంటే జులుం ప్రదర్శించే రెవెన్యూ, పోలీసు, మైనింగ్, సెబ్, విజిలెన్స్ అధికారులు.. ఇప్పుడు ఇసుక రీచ్‌లలో బహిరంగ దోపిడీ జరుగుతున్నా అటువైపు కన్నెత్తి చూడడం లేదు.

● కొనుగోలు చేయాల్సిన దుస్థితి

జిల్లాలో లభ్యమవుతున్న ఇసుకను పేదలు తమ సొంత అవసరాలకు తీసుకెళ్లడానికి వీల్లేదు. అలా తీసుకెళుతున్న వారిపై ఎన్నో కేసులు నమోదయ్యాయి. ఎక్కడి నుంచో వచ్చి అధికారమే అండగా జిల్లాలోని సంపదను దోచుకెళుతుంటే, వారి వద్ద నుంచి పేదలు ఇసుకను కొనుగోలు చేయాల్సిన దుస్థితి దాపురించింది. ప్రస్తుతం ఐదు రీచ్‌లలో ఇసుక తవ్వకాలు జరుగుతున్నాయి. పడమటికంభంపాడు, మిన గల్లు, ముదివర్తి, పల్లిపాడు రీచ్‌లతోపాటు సంగం డీసిల్టేషన్ పాయింట్ వద్ద కూడా ఇసుక తవ్వకాలకు ఉన్నతాధికారులు అనుమతులు ఇచ్చారు. అయితే నిబంధనల ప్రకారం పర్యావరణ అనుమతులు (ఈసీ) లేకుండా ఏ రీచ్‌లోనూ ఇసుకను తవ్వేందుకు లేదు. కానీ జిల్లాలో ఏ ఒక్క రీచ్‌కూ ఈసీ లేదు. గతేడాది మేనెలతోనే ఈసీ గడువు ముగిసింది. ఆ తర్వాత నుంచి స్టాక్ పాయింట్లలో నిల్వ ఉన్న ఇసుకనే విక్రయాలు చేస్తున్నట్లు ప్రభుత్వం చెబుతూ ఉన్నా వాస్తవానికి రీచ్‌లలో ఇష్టానుసారంగా తవ్వుతున్నారు. కొన్ని జిల్లాల్లోని రీచ్‌లకు మనుషులతో తవ్వేలా ఈసీ వచ్చింది. కానీ జిల్లాలోని రీచ్‌లకు కనీసం అది కూడా లేదు. పర్యావరణ నిబంధనల ప్రకారం నదుల్లో మీటర్‌కు మించి తవ్వకాలు జరపకూడదు. కానీ రీచ్‌లను పరిశీలిస్తే ఐదు మీటర్ల లోతు వరకు తవ్వకాలు జరుపుతున్నారు. ఈ ప్రభావం భూగర్భ జలాలపై పడుతుందని నిపుణులు చెబుతున్నారు. ఈ రీచ్‌లన్నీ ఒక ప్రత్యేక సామ్రాజ్యంగా మారిపోయాయి. ఇసుకను కొనేవారు మినహా మిగిలిన వారెవరికీ అందులోకి ప్రవేశం లేదు. గేటు వద్దనే కొందరు ప్రైవేటు వ్యక్తులు అడ్డుకుంటున్నారు.


● ఎన్జీటీకూ తప్పుడు నివేదిక..!

రాష్ట్రంలో నిబంధనలకు విరుద్ధంగా ఇసుక తవ్వకాలు జరుపుతున్నారని, ఈసీలు లేకుండా ఇసుకను తరలిస్తున్నారని నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్‌లో కేసు నమోదైంది. అయితే ప్రభుత్వమేమో ఎక్కడా రీచ్‌లలో ఇసుక తవ్వకాలు జరగడం లేదని చెబుతోంది. దీంతో ప్రతీ జిల్లాలో కనీసం ఒక ఇసుక రీచ్‌ను పరిశీలించి నివేదిక ఇవ్వాలని అన్ని జిల్లాల కలెక్టర్లకు చెన్నై బెంచ్ ఆదేశించింది. అయితే జిల్లాలో ఇప్పటికీ తవ్వకాలు జరుపుతున్న ఐదు రీచ్‌లలో అధికారులు పరిశీలించకుండా, తవ్వకాలు జరగని విరువూరు, అప్పారావుపాలెం రీచ్‌లలో పరిశీలన జరిపి గ్రీన్ ట్రిబ్యునల్‌కు నివేదిక ఇచ్చేందుకు సిద్ధమవుతున్నారు. అధికారుల నిబద్ధతకు ఇది నిదర్శనంగా కనిపిస్తోందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అయితే ఏ రీచ్‌లో పరిశీలన చేయాలన్నది కూడా రాష్ట్రస్థాయి నుంచి వచ్చిన ఆదేశాలేనని అధికార వర్గాల్లో చర్చించుకుంటున్నారు. ఇప్పటివరకూ ప్రజలను, కోర్టులను మభ్యపెడుతూ వస్తున్న ప్రభుత్వం ఇప్పుడు నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్‌ను కూడా తప్పుదోవ పట్టిస్తోందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.



ఇందుకూరుపేట మండలం పల్లెపాడు రీచ్‌లో లారీలకు ఇసుక లోడ్ చేస్తున్న యంత్రాలు (డ్రోన్‌ఫొటో)

జిల్లాపై బర్డ్ ఫ్లూ ప్రభావం



- మనుషులకు సోకే అవకాశం
- కోళ్లఫారాల్లో పనిచేసేవారు జాగ్రత్త
- మాస్కులు, గ్లౌజులు ధరించి పనిచేయాలి
- వ్యాధిసోకిన కోళ్లను కి.మీ దూరంలో నిర్వీర్యం చేయాలి
- చికెన్ కొనుగోళ్లు లేక దుకాణాలు వెలవెల
- చేపల మార్కెట్లకు ఎగబడ్డ జనం

నెల్లూరు (వైద్యం) ఫిబ్రవరి 18: జిల్లాపై బర్డ్ ఫ్లూ ప్రభావం చాలా ఎక్కువగా ఉంది. ఈ వ్యాధి మనుషులకు కూడా సోకే అవకాశం ఉండటంతో జిల్లా అధికార యంత్రాంగం తగిన హెచ్చరికలు జారీ చేసింది. వ్యాధి లక్షణాలు ఉండే వెంటనే వైద్యుడిని సంప్రదించి తగిన చికిత్సలు చేయించు కోవాలని వైద్యనిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇప్పటికే ప్రత్యేక బృందాలు కోళ్లఫారాలను పరిశీలించి తగిన సూచనలిచ్చారు. చాటగొట్ల, గుమ్మళ్లదిబ్బలో చనిపోయిన కోళ్లను కిలోమీటరు దూరంలో నిర్వీర్యం చేయాలని ఆదేశించారు. గతంలో పలు దేశాల్లో బర్డ్ ఫ్లూ వల్ల అనేకమంది చనిపోయి ఉండటంతో అప్రమత్తంగా ఉండాలని వారు చెబుతున్నారు. ఈజిప్ట్, ఇండోనేషియా, వియత్నాం, నెదర్లాండ్ దేశాల్లో 2003, 2016 సంవత్స రాల్లో బర్డ్ ఫ్లూ సోకిన 850 మందిలో 50 శాతం కంటే ఎక్కువగా మరణాలు సంభవించినట్లు ప్రపంచ ఆరోగ్య సంస్థ పేర్కొంది. హెచ్7ఎన్9 అనే బర్డ్ ఫ్లూ వైరస్ చైనాలోనూ వెలుగు చూడగా, వేలాది కోళ్ల ఫారాలను మూసి వేయించారు. పలువురికి వ్యాధి సోకింది. బర్డ్ ఫ్లూ వైరస్ గాలిలోనూ, ధూళిలోనూ వ్యాపించి మనుషులకు సోకే అవకాశం ఉందని వైద్యులు చెబుతున్నారు. ఈ పరిస్థితిలో మూడు రోజులుగా నెల్లూరు నగరంతోపాటు జిల్లాలోని పలు ప్రాంతాల్లో కోడి మాంసం దుకాణాలను అధికారులు మూసి వేయించారు.

● వైరల్ న్యూమోనియాకు అవకాశం

బర్డ్ ఫ్లూ వైరస్ వల్ల మనుషులు వైరల్ న్యూమోనియాకు గురయ్యే అవకాశం ఉంది. మూడు రోజులగా తగ్గని జ్వరం, గొంతునొప్పి, తలనొప్పి, దగ్గు, కండరాల నొప్పులు తదితర లక్షణాలు తీవ్రమైన శ్వాసకోశ వ్యాధులకు దారితీయవచ్చు. అలాగే కంటిపై కూడా తీవ్ర ప్రభావం చూపుతుంది. ఇలాంటి లక్షణాలు దీర్ఘకాలం ఉంటే తప్పనిసరిగా వైద్యులను సంప్రదించాలి. అలాగే కోళ్ల, పక్షుల మలం ద్వారా కూడా వైరస్ వ్యాప్తి చెందే అవకాశం ఉంది. కోళ్ల ఫారాల్లో పనిచేసేవారు తప్పనిసరిగా ఎన్95 మాస్క్‌తో పాటు చేతులకు గ్లౌజులు కూడా వేసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.

అప్రమత్తంగా ఉండాలి..



బర్డ్ ఫ్లూ మనుషులకు కూడా సోకే అవకాశం ఉంది. వ్యాధి లక్షణాలు కనిపిస్తే అలాంటివారు క్వారంటైన్‌లో ఉండటం ఉత్తమం. ప్రత్యేకించి మధుమేహం వంటి దీర్ఘకాలిక వ్యాధులు ఉన్నవారు బర్డ్ ఫ్లూ పట్ల అప్రమత్తంగా ఉండాలి.

- డాక్టర్ పోకల రవి, పల్మనాలజిస్ట్



సంగం : పట్టణంలోని చికెన్ దుకాణాలు ఆదివారం కొనుగోలు దారులు లేక వెలవెల పోయాయి. దీంతో దుకాణదా రులు నిరాశపడ్డారు. అయితే చేపల దుకాణాలు మాత్రం కళకళలాడాయి.

సీతారామపురం : పట్టణంలో ఆదివారం జనంతో కళకళలాడే చికెన్ దుకాణాలు బోసిపోయాయి. ఈ క్రమంలో చేపలు, మటన్ విక్రయాలు జోరందుకున్నాయి.ఉదయం నుంచే మాంసాహార ప్రియులు చేపల, మటన్ దుకాణాల వద్ద బారులు తీరారు.



చేపల దుకాణాలు కళకళ



పొదలకూరులో చేపల దుకాణం వద్ద వేచి ఉన్న ప్రజలు

పొదలకూరు, ఫిబ్రవరి 18 : మండలంలో బర్డ్ ఫ్లూ లక్ష ణాలు బయటపడడంతో పొదలకూరులో మూడు రోజులుగా చికెన్ క్రయవిక్రయాలను నిషేధించారు. అయితే ఆదివారం కావడంతో నాన్‌వెజ్ ప్రియులు చేపల కోసం ఎగబడ్డారు. దీంతో చేపలకు బాగా డిమాండ్ ఏర్పడింది. కిలో రూ.200 నుంచి రూ.300 వరకు అమ్మారు. కాగా స్థానిక చేపల మార్కెట్ కొనుగోలుదారులతో కిటకిటలాడింది.

ఇళ్ల మధ్యనే కోళ్లతో భయాందోళన

పొదలకూరులోని అగచాట్లపురం సమీపంలో ఉన్న సత్యనారాయణపురం, శ్రీనివాసనగర్‌లో కొంతకాలం నుంచి ఇళ్ల మధ్యలో బాయిలర్ కోళ్ల పెంపకం చేపట్టారు. బర్డ్ ఫ్లూతో భయపడుతున్న తరుణంలో ఈ బాయిలర్ కోళ్ల స్థావరంతో చుట్టుపక్కలవారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పట్టణంలో చికెన్ దుకాణాలు మూత పడగా, ఇక్కడి కోళ్ల వ్యా పారి మాత్రం రహస్యం గా పెద్ద ఎత్తున చికెన్‌ను, కోళ్లను పలు ప్రాంతాలకు తరలించి వ్యాపారం చేస్తున్నాడని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ కోళ్ల స్థావరాన్ని జనావాసా లకు దూరంగా తరలించాలని స్థానిక మహిళలు కోరుతున్నారు.



అభ్యర్థులకు అగ్నిపరీక్ష !

- పాత సిలబస్‌తోనే డీఎస్సీ నిర్వహణ
- దరఖాస్తులకు అధిక ఫీజుల వసూలు
- ఆన్‌లైన్‌లో సర్వర్ కష్టాలు
- నిరుద్యోగుల ఆందోళన

నెల్లూరు (విద్య), ఫిబ్రవరి 18 : డీఎస్సీ అభ్యర్థులకు ఫీజుల చెల్లింపు, సిలబస్ అగ్ని పరీక్షగా మారాయి. నిర్దేశించిన సిలబస్ పై అభ్యర్థులంతా తీవ్ర అసంతృప్తితో ఉన్నా రు. రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడా ది నుంచి ప్రతి ఏటా పాఠ్యపుస్తకాల్లో మార్పులు చేస్తూనే ఉంది. దీంతో కొత్త అభ్యర్థులు మారిన సిల బస్‌నే అనుసరిస్తుండగా, పాతవారు మాత్రం కొత్త, పాత సిలబస్‌లను అనుసరిస్తూ చదవాల్సి వస్తోంది. పాత పుస్త కాలు ఎక్కడా అందుబాటులో లేకపోవడంతో పాఠశాలల్లో ఉపాధ్యాయులను ఆశ్రయిస్తున్నారు. మరోవైపు టెట్, డీఎస్సీలకు దరఖాస్తులకు అధిక ఫీజులు వసూలు చేస్తున్నారని, ఆన్‌లైన్ సర్వర్‌లు సరిగా పనిచేయకపోవడం, కొంతమందికి ఫీజులు కట్ అవుతున్నా ఐడీలు రాకపోవడంతో దరఖాస్తు చేసుకోలేకపోతున్నామంటూ పలువురు ఆందోళన చెందుతున్నారు..

● అభ్యర్థుల ఆందోళన

రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన డీఎస్సీ గందరగోళంగా మారింది. ఓవైపు దరఖాస్తుల ఆందోళన, మరోవైపు సిలబస్ గందరగోళంతో అభ్యర్థులంతా ఆందోళన చెందుతున్నారు. 2018 ప్రకటనలో ఇచ్చిన సిలబస్‌నే అనుసరిం చాలని ఈ డీఎస్సీకి నిర్దేశించారు. 2019-20లో 3, 4, 5 తరగతుల సిలబస్‌ను మార్పు చేశారు.ఆ తర్వాత ఏడాదికో తరగతి చొప్పున సిలబస్‌ను మార్పులు చేస్తూ వచ్చారు. ఈ ఏడాది తొమ్మిదో తరగతి పాఠ్యపుస్తకాలు మార్పు చేసి ఈ సిలబస్‌ను కూడా జత చేయడంతో అభ్యర్థులకు మరింత భారంగా మారింది. పోస్టుల సంఖ్య తక్కువగా ఉండడం, సమయం మాత్రం 30 రోజులే ఉండడంతో పాఠ్యాంశాలు చదవడం, పునశ్చరణ కష్టంగా ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే సీబీఎస్ఈ పేరుతో 6, 7 తరగతుల పుస్తకాలను రెండుసార్లు మార్పు చేశారని, ఇందులో ఏ సంవత్సరానిది చదవాలో స్పష్టత లేదంటున్నారు. 2022లో నిర్వహించిన టెట్‌కు కొత్త సిలబస్‌నే ఇవ్వడంతో కొంతమంది అభ్యర్థులు కొత్త సిలబస్‌పైనే దృష్టి సారించారు. దీనిపై విద్యాశాఖ అధికారులు మాత్రం పుస్తకాలు మారి నాలుగేళ్లకు పైగా అయినందున ప్రస్తుతం పాతవి అందుబాటులో లేవంటున్నారు. గతంలో విద్యార్థులు తరగతులు మారిన తరువాత వారి నుంచి పాత పుస్తకాలను సేకరించేవారు. ఇప్పుడా పరిస్థితి లేకపోగా ఆన్‌లైన్‌లో సైతం కొత్తసిలబస్‌తోనే పీడీఎఫ్‌లు అందుబాటులో ఉండడంతో ఏమి చేయాలో తెలియక అభ్యర్థులు తలలు పట్టుకుంటున్నారు...

● అధిక ఫీజులతో కష్టాలు

డీఎస్సీకి దరఖాస్తు చేసుకోవాలంటే టెట్‌లో అర్హత సాధించాలి. ఈ పరీక్షలో సాధించిన మార్కుల ఆధారంగా డీఎస్సీలో వెయిటేజీ మార్కులు ఉంటాయి. గతంలో టెట్ అర్హత సాధించిన అభ్యర్థులు ఇప్పుడు మరోసారి దరఖాస్తు చేసుకుంటున్నారు. గతంలో రూ.25లు ఉండే దరఖాస్తు ప్రస్తుతం రూ.750లు చేయడంతో నిరుద్యోగులు ఇబ్బందులు పడుతున్నారు. పైగా ఆన్‌లైన్‌లో నగదు చెల్లించాక ఓటీపీ వస్తుండగా అది భర్తీ చేసినా కొంతమందికి ఐడీ రాకపోవడంతో నగదు కోత పడుతున్నాయంటూ ఆందోళన చెందుతున్నారు. అభ్యర్థికి ఐడీ వస్తేనే దరఖాస్తు చేసుకునే అవకాశం ఉండగా సర్వర్ సమస్యలతో నగదు కట్ అయిపోతుడడంతో జిల్లాలో పెద్ద సంఖ్యలో అభ్యర్థులు బ్యాంక్‌ల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ప్రభుత్వ వెబ్ సైట్ సరిగా పనిచేయక దరఖాస్తు ప్రక్రియ పూర్తికాకపోవడం, జరిగే పరిణా మాలపై బయట మాట్లాడితే తమను ఇబ్బందులు పెడతారేమోనన్న భయం అభ్యర్థులను వెంటాడు తోంది. అసలే నిరుద్యో గులమైన తాము అప్పులు తెచ్చి మరీ ఆన్‌లైన్‌లో ఫీజు చెల్లిస్తుండగా ఈ సొమ్ములు ప్రభుత్వ ఖాతాలోకి జమ అవుతున్నా తాము దరఖాస్తు చేసుకోలేక పోతున్నామని, మళ్లీ నగదు ఎక్కడి నుంచి తీసురావాలంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు ఈ విషయమై దృష్టి సారించి తమ సమస్యలను పరిష్క రించడంతోపాటు సిలబస్‌పై కూడా స్పష్టత ఇవ్వా లని పలువురు అభ్యర్థులు కోరుతున్నారు.





24న వ్యాసపూర్ణిమ నగరోత్సవం

- డీసీఎంఎస్ చైర్మన్ వీరి చలపతి

నెల్లూరు(హరనాథపురం), ఫిబ్రవరి 18 : ఈనెల 24న వ్యాసపూర్ణిమ సందర్భంగా నెల్లూరు జిల్లా కోఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటీ ఆధ్వర్యంలో వేదగిరి లక్ష్మీనరసింహస్వామి నగరోత్సవాన్ని వైభవంగా నిర్వహిస్తున్నామని ఆ సొసైటీ చైర్మన్ వీరి చలపతి రావు, బిజినెస్ మేనేజర్ వెంకటస్వామి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆ రోజు సాయంత్రం 4 గంటల నుంచి సాయంత్రం 6.30 గంటల వరకు నగరంలోని నవాబుపేటలో ఉన్న డీసీఎంఎస్ రైసు మిల్లులో లక్ష్మీనరసింహ స్వామివారికి పూజా కార్యక్రమం, అనంతరం నగరోత్సవం జరుగుతాయని తెలిపారు. ఏటా ఈ కార్యక్రమాన్ని క్రమం తప్పకుండా నిర్వహిస్తున్నట్లు వివరించారు.

ఆసరా సొమ్ములేవి ?

- సీఎం బటన్ నొక్కి నాలుగు వారాలు
- నిధుల విడుదలలో జాప్యం
- ఎన్నికల నేపథ్యంలో లబ్ధిదారుల్లో ఆందోళన
- వేలాదిమంది డ్వాక్రా సభ్యుల ఎదురుచూపు

సంగం, ఫిబ్రవరి 18: ఆసరా పథకానికి సీఎం బటన్ నొక్కి నాలుగు వారాలైనా, ఇంకా నాలుగోవంతు లబ్ధిదారుల ఖాతాల్లో కూడా నగదు జమ కాలేదు. గత నెల 23న ముఖ్యమంత్రి బహిరంగసభలో ఆసరా నాలుగో విడత నిధులకు బటన్ నొక్కారు. కానీ అవసరమైనన్ని నిధులు విడుదల కాక ఈ పరిస్థితి నెలకొంది. అయితే మరో రెండు వారాల్లో ఎన్నికల కోడ్ అమలులోకి వస్తుందన్న నేపథ్యంలో ఈలోపు ఆసరా నిధులు జమ అవుతాయో...? లేదోనని లబ్ధిదారుల్లో సందేహం వ్యక్తమవుతోంది. దీంతో వారు అటు సచివాలయాలు, ఇటు బ్యాంకుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. అధికారులు మాత్రం రేపో, మాపో జమవుతాయని చెబుతున్నారు.

● జమైంది.. లేనిది చూడారా ?

సంక్షేమ పథకాల అమలు కోసం బటన్లు నొక్కుతున్నా.. అని సీఎం బహిరంగ సభలో చెబుతున్నా, ఆ నిధులు లబ్ధిదారుల ఖాతాల్లో జమవుతునాయా... లేదా ? అనే విషయాన్ని మాత్రం పట్టించుకోవడంలేదు. ఆ డబ్బులు లబ్ధిదారుల ఖాతాల్లో పడకపోవడంతో వారు ఆందోళన చెందుతున్నారు. వాయిదాల పర్వం, దాటవేత ధోరణి, ఇతర కొర్రీలతో సంక్షేమ పథకాలను నీరుగార్చడంతో తలమునకలైన ప్రభుత్వం ఆసరా పథకాన్ని కూడా నీరుగార్చేందుకు ప్రయత్నిస్తోంది. అమ్మఒడి, చేయూత, పింఛను పథకాల మాదిరిగా ఆంక్షల పేరుతో లబ్ధిదారుల సంఖ్యలో కోత పెట్టేందుకు వీలు లేకపోవడంతో వాయిదాల పద్ధతిలో పథకాన్ని నీరుగార్చేందుకు పూనుకుంది. ఫలితంగా ఎప్పుడో 2023 నాటికే ఇవ్వాల్సిన ఆసరా వాయిదా పడింది.

● 3.29 లక్షల మంది లబ్ధిదారులు

జిల్లాలో 34,443 సంఘాల్లోని 3,29,841 మందికి ఆసరా కింద రూ.270.54 కోట్ల రుణమాఫీ నిధులు రావాల్సి ఉంది. ఈ మేరకు ఆసరా నిధులు విడుదల చేసినట్లు ప్రభుత్వం ప్రకటించింది. అన్ని పథకాల పరిస్థితే ఈ పథకానికి పట్టిందని లబ్ధిదారులు వాపోతున్నారు.

● 15 నెలల ఆలస్యం

2019 ఏప్రిల్‌లో ఎన్నికల ప్రచారం సందర్భంగా జగన్ మాట్లాడుతూ నవంబరులోపు డ్వాక్రా మహిళలకు ఉన్న రుణాలన్నింటినీ మాఫీ చేస్తానని హామీ ఇచ్చారు. అప్పటికే రుణాలు చెల్లించి ఉంటే, వారు చెల్లించిన మొత్తాన్ని తిరిగి చెల్లిస్తామని కూడా ఆయన ప్రకటించారు. ఎన్నికల్లో గెలిచి అధికారం చేపట్టిన 15 నెలల తరువాత 2020 సెప్టెంబరు 11న వైఎస్సార్ ఆసరా పేరుతో ప్రభుత్వం రుణమాఫీ పథకాన్ని ప్రారంభించింది. రెండోవిడత నెల ఆలస్యంగా 2021 అక్టోబరు 7న, మూడో విడత ఆరు నెలల ఆలస్యంగా అందచేసింది. 2022 అక్టోబరు నుంచి అదిగో ఇదిగో... అంటూ 2023 మార్చి చివరి వరకూ నెట్టుకిచ్చి మూడో విడత బటన్ నొక్కారు. తాజాగా నాల్గవ విడత ఆసరాకు గత నెల 23న బటన్ నొక్కారు.

● అన్ని పథకాలదీ ఇదే పరిస్థితి..?

సీఎం జగన్ బటన్ ఎప్పుడు నొక్కినా ఆ నగదు లబ్ధిదారుల ఖాతాల్లో చేరేందుకు కొంత సమయం పడుతోంది. ఒక్కోసారి రెండు నెలలు కూడా పట్టిన సందర్భాలు ఉన్నాయి. అమ్మఒడి, విద్యా దీవెన, వసతి దీవెన, చేదోడు.. ఇలా పథకం ఏదైనా లబ్ధిదారుల ఖాతాల్లో డబ్బులు పడేందుకు సమయం పడుతోంది. ఒక వేళ ఏ కారణం చేతనైనా జమ కాకపోతే ఇక అంతే సంగతులని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒక్కోసారి ప్రభుత్వం వద్ద ఆయా పథకాలకు అవసరమైన నిధులు లేకపోయినా సీఎం బటన్ నొక్కేస్తున్నారు. సీఎం బటన్ నొక్కాక ఒకరి ఖాతాలో జమ అయి, మరొకరి ఖాతాలో జమ కాకపోవడంతో లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు.



సంగంలో నిర్వహించిన ఆసరా కార్యక్రమం (ఫైల్)

నూతక్కివారికండ్రికలో విజృంభించిన జ్వరాలు

● వైద్యశిబిరం ఏర్పాటు చేసినా అదుపులోకి రాని వైనం



జ్వరంతో మంచమెక్కిన నూతక్కివారికండ్రిక వాసులు



చేజర్ల, ఫిబ్రవరి 18 : మండలంలోని నూతక్కివారికండ్రికలోని ప్రజలు జ్వరాల బారిన పడి అల్లాడుతున్నారు. గత వారం రోజుల నుంచి గ్రామంలో ఇంటికొకరు చొప్పున జ్వరాలతో మంచాలకే పరిమవుతున్నారు. ఇటీవల గ్రామంలో ప్రత్యేక వైద్యశిబిరం ఏర్పాటు చేసినా జ్వరాలు అదుపులోకి రాలేదని గ్రామస్థులు పేర్కొంటున్నారు. కాళ్లు వాయడం, ముఖం రంగు మారడం, నొప్పులతో తీవ్ర అస్వస్థతకు గురవుతున్నామని పేర్కొంటున్నారు. కొంతమంది పొదలకూరులోని ప్రయివేటు వైద్యశాలకు వెళ్ళినా జ్వరాలు తగ్గలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాగా, స్థానికంగా ఉండే వాటర్ ప్లాంటు పక్కనే కుంట ఉండడంతో తాగునీరు కలుషితమై ఉంటాయోమోనన్న అనుమానాలను గ్రామస్థులు వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి జ్వరాలు అదుపులోకి తీసుకురావాలని గ్రామస్థులు కోరుతున్నారు.

ముఖ్యమంత్రి ఆత్మ పరిశీలన చేసుకోవాలి

● ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బాబ్జి



సమావేశంలో మాట్లాడుతున్న మందా బాబ్జి

నెల్లూరు (హరనాథపురం), ఫిబ్రవరి 18 : ఎన్నికలకు ముందు ప్రతిపక్ష నేతగా పలు సందర్భాలలో ఉద్యోగులకు ఇచ్చిన హామీలపై ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఆత్మ పరిశీలన చేసుకోవాలని ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మందా బాబ్జి కోరారు. నెల్లూరులోని ఓ భవనంలో ఆదివారం ఆ అసోసియేషన్ నాయకుల సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన వెంటనే సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరిస్తామని ఇచ్చన హామీని జగన్ నెరవేర్చాలని డిమాండ్ చేశారు. పీఆర్‌సీ ప్రకటించి, ఐఆర్ ఇవ్వాలని, డీఏ బకాయిలను వెంటనే చెల్లించాలని కోరారు.

వ్యాయామ ఉపాధ్యాయ సంఘం జిల్లా కార్యవర్గం ఏకగ్రీవం



ఎంపికైన కార్యవర్గం

నెల్లూరు (విద్య), ఫిబ్రవరి 18 : వ్యాయామ ఉపాధ్యాయ సంఘం జిల్లా కార్యవర్గాన్ని నెల్లూరులోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో ఎంపిక చేశారు. ఆదివారం నిర్వహించిన ఈ కార్య క్రమంలో అధ్యక్షుడిగా గాదం వాసు, ప్రధాన కార్యదర్శిగా పీ థామస్ పీటర్, కోశాధికారి గా పీ చిరంజీవి, సలహాదారుగా ఎం చంద్రశేఖర్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా పీ తిరుపతయ్య, నిర్వాహక కార్యదర్శిగా టీవీ సురేష్, హెడ్‌క్వార్టర్స్ కార్యదర్శిగా ఏ విజయ్‌కుమార్, ఉపాధ్యక్షులు, సహాయ కార్యదర్శులు, సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈనెల 29న ఉద్యోగ విరమణ చేయనున్న వ్యాయామ ఉపాధ్యాయుడు టీజీ స్వామిని సత్కరించారు. ఈ ఎన్నికలను వ్యాయామ ఉపా ధ్యాయ సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎన్ ప్రభాకర్‌రెడ్డి, ఎన్నికల అధికారి ఎస్‌కే కరిముల్లా పర్య వేక్షణలో నిర్వహించారు.

గ్రావెల్ తవ్వకాలను అడ్డుకున్న గ్రామస్థులు



రోడ్డుపై పడుకుని టిప్పర్లను అడ్డుకుంటున్న గ్రామస్థులు

కొడవలూరు, ఫిబ్రవరి 18 : మండలంలోని కమ్మపాళెం పంచాయతీ వడ్డపాలెంలో గ్రావెల్ తవ్వకాలను గ్రామస్థులు అడ్డుకున్నారు. వివరాల మేరకు... కమ్మపాళెంకు చెందిన ఓ వ్యక్తి తన సొంత పొలంలో గ్రావెల్ తవ్వకాలను చేపట్టారు. నిబంధనలకు విరుద్ధంగా తవ్వకాలు చేపట్టడంతో గ్రామస్థులు ఆదివారం అడ్డుకున్నారు. ఈ క్రమంలో ఆ వ్యక్తికి గ్రామస్థులకు మధ్య స్వల్ప ఘర్షణ జరిగింది. రోజూ పదుల సంఖ్యలో టిప్పర్లతో దూర ప్రాంతాలకు గ్రావెల్ తరలిస్తుండడంతో గ్రామంలో ఒక్క సారిగా వాహనాల రద్దీ నెలకొంది. వాహనాల అతి వేగంతో భయాందోళన నెలకొంది. దీంతో రోడ్లు సైతం ధ్వంసమయ్యాయి. ఈ నేపథ్యంలో గ్రామస్థులు గ్రావెల్ తవ్వకాలు అడ్డుకోవడంతో పాటు వాహనాలను పోనివ్వకుండా రోడ్డుపై బయఠాయించి నిరసన వ్యక్తం చేశారు. దీంతో వాగ్వివాదం జరిగింది. ఈ సందర్భంగా గ్రామస్థులు మాట్లాడుతూ పెద్ద పెద్ద గుంతలు తీస్తున్నందున భూగర్భ జలాలు అడుగంటి గ్రామంలో మంచి నీటి ఎద్దడి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. వర్షకాలంలో ఆ పెద్ద గుంటల్లో చిన్నారులు ప్రమాదవశాత్తు పడే ఆవకాశం ఉందని వాపోయారు. అధికార పార్టీ నాయకుడు నిబంధనలకు విరుద్ధంగా ఎలాంటి తవ్వకాలు చేయనని హామీ ఇవ్వడంతో వివాదం సద్దుమనిగింది.

రైలులో 3.6 కిలోల వెండి స్వాధీనం

నెల్లూరు(క్రైం), ఫిబ్రవరి 18 : రైలులో అక్రమంగా తరలిస్తున్న 3.600 కేజీల వెండిని రైల్వే పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వివరాలను ఆదివారం నెల్లూరులోని జీఆర్‌పీఎస్ స్టేషన్‌లో ఇన్‌స్పెక్టర్ కే భుజంగరావు విలేకర్లకు వివరించారు. ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని రైళ్లలో పోలీసులు ముమ్మరంగా తనిఖీలు చేస్తున్నారన్నారు. ఈ క్రమంలో గూడూరు జీఆర్‌పీఎస్ ఎస్‌ఐ కే కొండప్పనాయుడు సిబ్బందితో కలిసి శనివారం చెన్నై సెంట్రల్ సబర్బన్ ఎక్స్‌ప్రెస్‌లో తనిఖీలు చేపట్టారని చెప్పారు. ఓ వ్యక్తి రైలు నుంచి దిగుతుండగా అనుమానంతో అతని బ్యాగును సోదా చేశారన్నారు. అందులో ఎటువంటి రశీదులు లేకుండా అక్రమంగా తరలిస్తున్న 1 కేజీ 400 గ్రాముల సిల్వర్ బిస్కెట్, 2 కేజీల 200 గ్రాముల వెండి ఆభరణాలను గుర్తించారని చెప్పారు. వాటిని తరలిస్తున్న వ్యక్తిని, ఆభరణాలను స్వాధీనం చేసుకుని స్టేషన్‌కు తరలించారన్నారు. తమిళనాడు రాష్ట్రం కాంచీపురం దుంద్రభుర్ ప్రాంతానికి చెందిన జీ సెంథిల్, చెన్నైకు చెందిన గురుగణేష్ కలిసి సూళ్లూరుపేట, నాయుడుపేట ప్రాంతాల్లోని బంగారు దుకాణాలకు వెండి ఆభరణాలు అమ్ముతున్నట్లు పోలీసు విచారణలో తేల్చారు. వెండి ఆభరణాలను తదుపరి విచారణ నిమిత్తం ఆదాయపు పన్ను శాఖ అధికారులకు అప్పగించినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

కారు, మోటార్‌బైక్ ఢీ

● ఒకరికి తీవ్ర గాయాలు

దుత్తలూరు(ఉదయగిరి రూరల్), ఫిబ్రవరి 18: కారు, మోటార్‌బైక్ ఢీకొని ఒకరికి తీవ్ర గాయాలైన సంఘటన మండలంలోని నందిపాడు సెంటర్ సమీపంలోని 565 జాతీయ రహదారిపై ఆదివారం చోటుచేసుకొంది. వివరాల మేరకు.. ఉదయగిరి మండలం వడ్డిపాళెం గ్రామానికి చెందిన బత్తల రామయ్య తన భార్యతో కలిసి బైక్‌పై నందిపాడు కేజీబీవీలో చదువుతున్న తన కుమార్తె వద్దకు వెళ్లారు. భార్యను పాఠశాలలో వదిలి కుమార్తెకు ఏమైనా తిను బండరాలు తీసుకొద్దామని నందిపాడు సెంటర్‌కు బయలుదేరాడు. ఈ క్రమంలో దుత్తలూరు నుంచి కడప జిల్లా బద్వేల్‌కు వెళుతున్న కారు బైక్‌ను ఢీకొట్టింది. దీంతో రామయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే అదే కారులో చికిత్స నిమిత్తం ఉదయగిరి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం ఆత్మకూరు తరలించారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	146
లేయర్ లైవ్	80
స్కిన్ చికెన్	256
స్కిన్‌లెస్	284
లేయర్	136

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ. 5898
వెండి కిలో ధర	రూ. 74,000
వెండి ఒక గ్రాము	రూ. 76.00

బెల్టు దుకాణాలపై దాడులు

మర్రిపాడు, ఫిబ్రవరి 18: మర్రిపాడు మండలంలోని పలు గ్రామాల్లో మద్యం బెల్టు దుకాణాలపై జిల్లా టాస్క్‌ఫోర్స్ అధికారులు ఆదివారం దాడులు చేశారు. ఈ తనిఖీల్లో ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేశారు, 53 మద్యం సీసాలు స్వాధీనం చేసుకొని ఉదయగిరి సెబ్ సీఐకు అప్పగించారు.

ఎంపీపీపై దాడి

సీతారామపురం, ఫిబ్రవరి 18: మండలంలోని బసినేనిపల్లి గ్రామంలో ఎంపీపీ చింతరెడ్డి పద్మావతిపై బీజేపీ నాయకుడు మడమల్ల రమేష్‌రెడ్డి దాడి చేసి గాయపరిచాడు. విషయం తెలుసుకున్న ఎస్సై అనూష రమేష్‌రెడ్డిని అరెస్ట్ చేసి, కేసు నమోదు చేశామని తెలిపారు.

మిమ్మల్ని నమ్మేదేలే !

● ప్రభుత్వానికి తేల్చి చెప్పిన కాంట్రాక్టర్లు
● ప్యాచ్ వర్కులకు ముందుకురాని వైనం
● ఐ ప్యాక్ పనుల అగ్రిమెంట్‌పై నిరాసక్తి
● తమకు డబ్బులివ్వడం లేదని వేదన
● రోడ్లపై గుంతలు.. ప్రజలకు వెతలు

నెల్లూరు, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : 'మా నమ్మకం నువ్వే జగన్'.. అంటూ వైసీపీ ప్రచారం చేసుకుంటుంటే 'వైసీపీ ప్రభుత్వంపై మాకు నమ్మకం లేదు' అంటూ కాంట్రాక్టర్లు తెగేసి చెబుతున్నారు. ఇక గుంతల రోడ్లపై ప్రయాణిస్తున్న ప్రజలు 'మరోసారి నమ్మకం ఉంచితే ఈ గుంతలే మిగులుతాయి' అంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రజాజీవనంలో నాణ్యమైన రోడ్లు చాలా అవసరం. కానీ వైసీపీ ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి రోడ్లను పట్టించుకోవడం మానేసింది. ఆఖరుకు ప్యాచ్‌లు కూడా చేయలేని దుస్థితి నెలకొంది. జిల్లాలో పరిస్థితిని గమనిస్తే 'ఏ రోడ్డు చూస్తే ఏమున్నది గర్వకారణం' అన్న విధంగా పరిస్థితులు తయారయ్యాయి. ఆర్‌అండ్‌బీ, పంచాయతీ రోడ్లన్నీ ఎంత దారుణంగా ఉన్నాయో క్షేత్రస్థాయిలో పరిశీలిస్తే స్పష్టమవుతుంది. చేసిన పనులకు ప్రభుత్వం బిల్లులు ఇవ్వకపోవడంతో తదుపరి పనులు చేసేందుకు ఏ ఒక్క కాంట్రాక్టర్ కూడా ముందుకు రావడం లేదు. ఒక రోడ్డును కొంత దూరం అభివృద్ధి చేయడం, ఆ తర్వాత బిల్లు రాకపోవడంతో అక్కడికి ఆపేయడం పరిపాటిగా మారింది. అసలు రెండేళ్ల నుంచైతే కనీసం టెండర్లు వేసేందుకు కూడా కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదు. గత ప్రభుత్వంలో టెండర్లు పిలిచిన ఏఐఐబీ వర్కులను కూడా ఇప్పుడు చేసేందుకు కాంట్రాక్టర్లు భయపడుతున్నారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు.

● **ప్యాచ్ వర్కులకు నిధులు**

జిల్లాలోని ప్రధాన రహదారులను పూర్తిగా అభివృద్ధి చేయాల్సి ఉంది. కానీ ప్రభుత్వం వద్ద నిధుల్లేవు. మరోవైపు ప్రజల నుంచి ఆగ్రహావేశాలు పెల్లుబిక్కుతుండడంతో ఇటీవల జిల్లాలోని ఆర్‌అండ్‌బీ రోడ్లకు కనీసం ప్యాచ్‌లయినా వేయాలని రూ.10 కోట్లను ప్రభుత్వం మంజూరు చేసింది. నెల్లూరు, కావలి డివిజన్లకు రూ.5 కోట్లు, గూడూరు డివిజన్‌కు మరో రూ.5 కోట్లు మంజూరు చేస్తున్నట్లు ఉత్తర్వులు వెలువడ్డాయి. దీంతో గతనెలలో ఆర్‌అండ్‌బీ అధికారులు సుమారు వంద ప్యాచ్ వర్కులకు టెండర్లు పిలిచారు. ఒక్కో వర్కు విలువ సరాసరి రూ.10 లక్షలు ఉంది. అయితే ఏ ఒక్క పనికి కాంట్రాక్టర్లు టెండర్లు వేయలేదు. దీంతో ఇప్పుడు రెండోసారి మళ్లీ టెండర్లు పిలిచారు. ఈ దఫా కూడా ఎవరూ వేసే పరిస్థి తులు కనిపించడం లేదు. పేరుకు ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది గానీ వాటిని అమలు చేయ డంలో మాత్రం విఫలమవుతోంది. బిల్లులిస్తారన్న నమ్మకం లేక కాం ట్రాక్టర్లు పనులు చేసేందుకు ఆసక్తి చూపడం లేదు.

● **అత్యవసర పనులకూ లేదు మోక్షం!**

గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరిగినప్పుడు ఐ-ప్యాక్ టీం సర్వే చేసింది. ఆ సర్వే ప్రకారం రోడ్లు గుంతలమయంగా ఉండడంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉందని గుర్తించింది. దీంతో జిల్లాలో కనీసం 23 ప్రధాన కనెక్టివిటీ రోడ్లను అత్యవసరంగా బాగు చేయాలని ఐ-ప్యాక్ టీం ప్రభుత్వానికి సూచించింది. ఈ క్రమంలో ఆ రోడ్లను బాగు చేసేందుకు రూ.87 కోట్లు గతేడాది జూలైలో అనుమతులు మంజూరు చేసింది. అయితే అప్పటికే భారీగా బిల్లులు పెండింగ్ ఉండడం, ప్రభుత్వ తీరుతో విసిగి వేజారిన కాంట్రాక్టర్లు ఆ వర్కులకు టెండర్లు వేయకూడదని అసోసియేషన్ సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. దీంతో ప్రభుత్వ పెద్దలు కాంట్రాక్టర్లతో సమావేశమై పెండింగ్ బిల్లులను విడతల వారీగా చెల్లిస్తామని హామీ ఇచ్చారు. ఐ-ప్యాక్ వర్కులకు టెండర్లు వేయాలని కోరారు. దీన్ని నమ్మిన



సీతారామపురం బస్టాండ్ సెంటర్లో ఉదయగిరి-సీతారామపురం రోడ్డుపై ఏర్పడిన భారీ గుంతలు

కాంట్రాక్టర్లు జిల్లాలో ఆ 23 వర్కులకు టెండర్లు వేశారు. కానీ ఇచ్చిన మాట ప్రకారం ప్రభుత్వమేమో పెండింగ్ బిల్లులు చెల్లించలేదు. దీంతో అగ్రిమెంట్లు చేసుకోకుండా ఆగిపోయారు. అయితే ఈ దఫా నిబంధనలను తెరమీదకు తెచ్చి అగ్రిమెంట్లు చేసుకోకపోతే బ్లాక్‌లిస్టులో పెడతామని కాంట్రాక్టర్లను బెదిరించడం ప్రారంభించారు. ఇప్పుడిప్పుడు ఒక్కొక్క కాంట్రాక్టర్ అగ్రిమెంట్ చేసు కుంటున్నారు. కానీ పనులు మాత్రం మొదలు పెట్టడం లేదు. ఇలా గతంలో అనేకసార్లు ప్రభుత్వ పెద్దల మాటలు విని మోసపోయిన కాంట్రాక్టర్లు ఇప్పుడు అసలు టెండర్లు అనే ఆలోచన కూడా చేయడం లేదు. ఈ ప్రభావం ప్రజలపై తీవ్రంగా పడుతోంది. రోడ్డు మొత్తాన్ని బాగు చేయడం అటుంచితే కనీసం భారీ గుంతలను పూడ్చాలని వేడుకుంటున్న ప్రజలకు ఆ కష్టం కూడా తీరేలా కనిపించడం లేదు.

రెండోసారి పిలిచాం

నెల్లూరు, గూడూరు, కావలి డివిజన్లలో ప్యాచ్ వర్కులకు టెండర్లు పిలిచాం. మొదటి కాల్‌లో స్పందన లేని వర్కులకు మళ్లీ ఇప్పుడు రెండో కాల్‌లో టెండర్లు ఆహ్వానించాం. హై ఇంపాక్ట్ రోడ్లకు సంబంధించి అగ్రిమెంట్లు చేసుకున్నాం. త్వరలోనే పనులు మొదలు పెట్టిస్తాం.

- గంగాధర, ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈ

రియల్టర్ కబ్జాతో పంట కాలువ మయం

● ధనలక్ష్మీపురంలో ఆక్రమణ... సాగునీరు ప్రశ్నార్థకం



పూడ్చేసిన పంటకాలువ

నెల్లూరు రూరల్, ఫిబ్రవరి 18 : ఓ రియల్ ఎస్టేట్ వ్యాపారి ఆక్రమణ దాహానికి ఏకంగా పంట కాలువే మాయమైంది. రూరల్ నియోజకవర్గ పరిధిలోని ధనలక్ష్మీపురం నుంచి కలివెలపాళెంకు వెళ్లే దారిలో వీబీఆర్ నగర్‌కు కుడివైపు నూతనంగా నిర్మించిన ఓ రియల్ వెంచర్ యజమాని ముందున్న పం ట కాలువను తన వెంచర్‌లో కలిపేసుకు న్నాడు. చదును చేసేసి ప్లాట్లు నిర్మించేందుకు సిద్ధమయ్యాడు. అధికార పార్టీ నాయకుల అండదండలుండటంతో అధికారులను కూడా లెక్కచేయకుండా ఆక్రమణ లకు తెగబడ్డాడు. ఈ కాలువ ద్వారా సామంతుల వారితోపు, కాకుపల్లి, లింగాయపాళెం, గమళ్లపాళెంలోని పంట పొలాలకు సాగు నీరు పారుతుంది. అలాంటి కాలువ ఆక్రమణకు గురికావడంతో రైతులు లబోదిబోమంటున్నారు.

కదిరి నుంచి నెల్లూరుకు
టీడీపీ వీరాభిమాని సైకిల్ యాత్ర



కదిరి నుంచి నెల్లూరుకు సైకిల్‌పై వస్తున్న టీడీపీ వీరాభిమాని సతీష్

సంగం, ఫిబ్రవరి 18: ఎన్టీఆర్ అభిమానం సంఘం అని ముద్రించిన తెల్లనీ బన్నీ ధరించి సైకిల్‌కి ముందు పసుపు జెండాలో నారా లోకేష్, కందికుంట వెంకట ప్రసాద్ (మాజీ ఎమ్మెల్యే), సీటు వెనుక భాగంలో ఎర్ర జెండాలో నారా లోకేష్ ఫోటో ఫ్లెక్సీ పెట్టుకుని ఓ యువకుడు సైకిల్‌పై నెల్లూరు వైపు వెళ్తూ మార్గమధ్యంలో సంగంలో మీడియా కంటపడ్డాడు. ఈ సందర్భంగా ఆ యువకుడ్ని పలకరించగా తన పేరు సతీష్ అని, తాను టీడీపీ వీరాభిమానినని తెలిపాడు. 2024 ఎన్నికల్లో టీడీపీ విజయకేతనం ఎగురవేసి నారా చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలని ఆకాంక్షిస్తూ ప్రకాశం జిల్లా కదిరి నుంచి శనివారం ఉదయం బయలుదేరి సైకిల్‌పై నెల్లూరు టీడీపీ కార్యాలయానికి వెళ్తున్నట్లు తెలిపాడు. వైసీపీని వీడి నెల్లూరు రూరల్ నుంచి టీడీపీ అభ్యర్థిగా పోటీచేయనున్న కోటంరెడ్డిని కలిసి శుభాకాంక్షలు తెలుపుతానని పేర్కొన్నాడు. పార్టీ ప్రచారంలో భాగంగా నారా లోకేష్, కదిరి మాజీ ఎమ్మెల్యే వెంకట ప్రసాద్ ఫోటోలు ఉన్న ఫ్లెక్సీని సైకిల్ కట్టుకుని సైకిల్ తొక్కుకొంటు వస్తున్నట్లు తెలిపాడు.

23న గ్లోబల్ బిజినెస్ జాతీయ సదస్సు

నెల్లూరు (సాంస్కృతికం), ఫిబ్రవరి 18 : ఆంధ్ర చాంబర్స్ ఆఫ్ కామర్స్, చెన్నై ఆధ్వర్యంలో ఈనెల 23న గ్లోబల్ బిజినెస్ జాతీయ సదస్సు నిర్వహిస్తున్నట్లు ఆ చాంబర్ వైస్ ఛైర్మన్, ఆడిటర్ ఏవీఎస్ కృష్ణమోహన్ తెలిపారు. ఆదివారం నెల్లూరులోని జర్నలిస్టు భవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ ఒక్కరోజు సదస్సు చెన్నై నగరంలోని గిండి ప్రాంతంలో ఉన్న రమదా ప్లాజాలో జరుగుతుందని తెలిపారు. చాంబర్ నాయకులు ఎన్ బలరామయ్య నాయుడు, ఎస్ రమేష్ మాట్లాడుతూ తమ చాంబర్ వర్తక, వాణిజ్య, పారిశ్రామిక వర్గాలకు 30 ఏళ్లుగా సేవలు అందిస్తోందని తెలిపారు. మారుతున్న వ్యాపార ప్రపంచంలో అవగాహన కల్పించేందుకు ఈ సదస్సు ఏర్పాటు చేశామని తెలిపారు. హాజరుకావాలనుకునేవారు 98480 77227 నెంబరును సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.

ఎన్నికల విధుల నుంచి ట్రెజరీ ఉద్యోగులకు మినహాయింపు

ఉదయగిరి, ఫిబ్రవరి 18: రానున్న సార్వత్రిక ఎన్నికల విధుల నుంచి ట్రెజరీ ఉద్యోగులకు ప్రభుత్వం మినహాయింపు ఇచ్చిందని ఉదయగిరి తాలుకా ఎన్‌జీవో అధ్యక్షుడు బొమ్మతట్టు శ్రీహరి ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ట్రెజరీ బిల్లులతోపాటు ఖర్చులు, బిల్లుల చెల్లింపులతో ఎన్నికల్లో పట్టుబడిన నగదు, ఉద్యోగుల పర్యవేక్షణ అవసరం ఉన్నందున ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందని, ట్రెజరీ ఉద్యోగులు ఈ విషయాన్ని గమనించాలని ఆయన కోరారు.

ఓటు హక్కుపై 24న చర్చా వేదిక

నెల్లూరు (సాంస్కృతికం), ఫిబ్రవరి 18 : ఓటు హక్కు వినియోగించుకున్న ప్రతి ఓటరుకు ప్రోగ్రెస్ కార్డులు ఇస్తే రానున్న ఎన్నికల్లో 90శాతం ఓట్లు పోల్ అవుతాయని ఏ ట్రస్ట్ ఏ ఫర్ ఆల్ సంస్థ వ్యవస్థాపకుడు అళహరి వెంకటేష్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. దొంగ ఓట్ల నివారణ, ఇండియా ఓటర్స్ యాప్ తదితర అంశాలపై ఈనెల 24న చర్చావేదిక ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమం టౌనుహాలులోని మినీ హాలులో సాయంత్రం 5గంటల నుంచి జరుగుతుందని తెలిపారు. ప్రజాస్వామ్యవాదులు, పరిరక్షకులు తరలిరావాలని కోరారు.

తెల్లరాయి అక్రమ తవ్వకాలపై దాడులు



అటవీశాఖ అధికారులు స్వాధీనం చేసుకున్న టిప్పర్

సైదాపురం, ఫిబ్రవరి 18: మండల పరిధి లోని శాగణం గ్రామ అటవీ భూముల్లో అక్రమ తెల్ల రాయి తవ్వకాలపై ఆదివారం అటవీ శాఖ అధికారులు దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా నెల్లూరు రేంజర్ మాల్యాద్రి మా ట్లాడుతూ డిఎఫ్ఓ ఆవుల చంద్రశేఖర్ ఆదేశాల మేరకు దాడులు చేసి తెల్లరాయి తవ్వకాలు నిర్వహిస్తున్న వాహనాలను స్వాధీనం చేసుకుని విచారణ చేపడు తున్నామని తెలిపారు. వీరివెంట అటవీశాఖ సిబ్బంది ఉన్నారు.

రాజకీయ ప్రాధాన్యమిచ్చిన పార్టీలకే ఓట్లు

● ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలి
● దళిత సంఘాల సమావేశంలో పందిటి సుబ్బయ్య



మాట్లాడుతున్న పందిటి సుబ్బయ్య మాదిగ

నెల్లూరు (హరనాథపురం): మాదిగలకు రాజకీయ ప్రాధాన్యత కల్పించిన పార్టీలకే మాదిగలు ఓట్లు వేసి గెలిపిస్తారని సీమాంధ్ర ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పందిటి సుబ్బయ్య మాదిగ చెప్పారు. ఆదివారం నెల్లూరులోని ఓ హోటల్‌లో దళిత సంఘాల నాయకులతో సమావేశం జరిగింది. సుబ్బయ్య మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని పార్టీలు మాదిగల సంక్షేమాన్ని విస్మరించాయని చెప్పారు. మాదిగల అభ్యున్నతికి కృషి చేసే పార్టీలకు మద్దతు ఉంటుందన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో అన్ని పార్టీలు మాదిగలకు ఎంపీ, ఎమ్మెల్యే సీట్లను కేటాయించాలని డిమాండ్ చేశారు. నామినేటెడ్ పదవుల్లోనూ ప్రాధాన్యమివ్వాల న్నారు. ఎస్సీ వర్గీకరణను వెంటనే చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో దళిత సంఘాల నాయకులు డేగా రఘురాఘవేంద్ర రావు, విజయకుమార్, కుడుముల సుబ్బారావు, శ్రీనునాగేశ్వరావు, మాతంగి కృష్ణ, బద్దెపూడి రవీంద్ర, పలుగు రమణయ్య, గడ్డం శేఖర్ పాల్గొన్నారు.

డీఎస్సీ అభ్యర్థుల వయోవేదన !

● వయోపరిమితిని 46 ఏళ్లకు పొడిగించాలి : నిరుద్యోగుల డిమాండ్
● స్పందించని ప్రభుత్వం
● అర్హత కోల్పోతామంటూ అభ్యర్థుల ఆవేదన
● తెలంగాణలో 46 ఏళ్లకు సడలింపు
● రాష్ట్రంలో ఐదేళ్లుగా డీఎస్సీ నిర్వహణ శూన్యం

సంగం, ఫిబ్రవరి 18: అధికారంలోకి వచ్చాక మెగా డీఎస్సీ నిర్వహించి ఖాళీ టీచర్ పోస్టులన్నీ భర్తీ చేస్తామని హామీ ఇచ్చి, అధికారంలోకి వచ్చాక ఆ విషయాన్ని వైసీపీ ప్రభుత్వం గాలికి వదిలేసింది. అయితే ఎన్నికలు సమీపిస్తున్న ఈ తరుణంలో టెట్, డీఎస్సీ పరీక్షలను వెంటవెంటనే నిర్వహించేందుకు ఆగమేఘాలపై నోటిఫికేషన్ విడుదల చేసింది. అయితే ఐదేళ్లుగా డీఎస్సీ నోటిఫికేషన్ వెలువడక వయసు పైబడిన నిరుద్యోగులు ఎంతోమంది ఉన్నారు. వీరు అర్హత కోల్పోయారు. దీంతో వయోపరిమితిని 44 నుంచి 46 ఏళ్లకు సడలించాలని డీఎడ్, బీఈడీ చేసిన నిరుద్యోగులు డిమాండ్ చేస్తున్నారు. కాగా తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం వయో పరిమితిని 44 నుంచి 46 ఏళ్లకు పెంచింది. కానీ మన రాష్ట్ర ప్రభుత్వం మాత్రం పట్టించుకోలేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

● **నిరుద్యోగులకేది ఒక్క చాన్స్?**

ఒక్కచాన్స్ అంటూ వేడుకుని అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం నిరుద్యోగులకు మాత్రం ఆ ఒక్క చాన్స్ ఇవ్వడానికి నిరాకరిస్తోంది. ఐదేళ్లుగా డీఎస్సీ కోసం ఎదురుచూస్తూ ప్రకటన వెలువడ్డాక వయసు పైబడిన ఎందరో నిరుద్యోగులు డీఎస్సీ పరీక్ష రాసే అవకాశాన్ని కోల్పోతున్నారు. దీంతో వారు ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పక్క రాష్ట్రం తెలంగాణలో నిరుద్యోగుల ఆవేదనను అర్థం చేసుకున్న సీఎం రేవంత్‌రెడ్డి వయోపరిమితిని 46 ఏళ్లకు సడలించారు. కానీ జగన్ ప్రభుత్వం మాత్రం ససేమిరా అంటోంది.


● **ప్రభుత్వ జాప్యంతో..**

ప్రభుత్వం డీఎస్సీ నోటిఫికేషన్ ఇవ్వ కుండా చేసిన జాప్యానికి వయసు దాటిన నిరుద్యోగులు బలైపోయారు. తాజాగా డీఎస్సీ అభ్యర్థులు కూడా తమ వయో పరిమితిని 46కు పెంచాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు. పోటీ పరీక్షల్లో నెగ్గి ఉద్యోగం పొందేందుకు సీనియర్ నిరుద్యోగులకు ఇదే చివరి అవ కాశం. వయోపరిమితి దాటిపోయినవారు ఈసారి ఉద్యోగం పొందలేకపోతే ఇక ఉద్యోగం వచ్చే అవ కాశం ఎంతమాత్రం లేదు. మిగిలిన వారందరికీ ఈ నోటిఫికేషన్ కాకపోతే మరో నోటిఫికేషన్ వచ్చే అవకాశం ఉంది. కానీ సీనియర్లకు అలా కాదు. కానీ ప్రభుత్వం ఈ అంశాన్ని మానవీయ కోణంలో కూడా ఆలోచించడానికి నిరాకరించడం నిరుద్యోగుల పాలిట శాపంగా పరిణమిస్తుంది.

● **గత ప్రభుత్వంలో సడలింపు**

టీడీపీ ప్రభుత్వ హయాంలో పలుమార్లు వయో పరిమితిని సడలించి నిరుద్యోగులు ఉద్యోగాలు పొందే అవకాశం కల్పించింది. గ్రూప్-1, గ్రూప్-2, డీఎస్సీ నోటిఫికేషన్లు రెండుసార్లకు పైగా ఇచ్చారు. వీటితోపాటు పలు శాఖల ఇంజనీరింగ్, డిగ్రీ లెక్చరర్, హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ తదితర పోస్టులకు టీడీపీ ప్రభుత్వం నోటిఫికేషన్లు విడుదల చేసింది. నిరుద్యోగుల పరిస్థితిని అర్థం చేసుకుని అన్ని పరీక్షలకు వయోపరిమితిని సడలించింది. కానీ ప్రస్తుత ప్రభుత్వం నిరుద్యోగుల ఆవేదనను ఏమాత్రం పట్టించుకోవడంలేదు.


ఒక్క అవకాశం కల్పించాలి...



వయోపరిమితిని సడలించి వయసు పైబడినవారికి ఒక్క అవ కాశం కల్పించాలి. గత నాలుగున్నరేళ్లగా డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయని కారణంగా ఈ వెసులుబాటు కల్పించాల్సిన అవసరం ఉంది. ప్రభుత్వం మానవీయ కోణంలో ఆలోచించి నిర్ణయం తీసుకోవాలి.

- శివకుమార్, బీఈడీ అభ్యర్థి

డీఎస్సీకి అర్హత కోల్పోయా...



బీఈడీ పూర్తి చేసి గతంలో రెండుసార్లు డీఎస్సీ రాశా. పోస్టు రాలేదు. నాలుగున్నరేళ్లుగా డీఎస్సీ కోసం ఎదురుచూశా. నోటిఫికేషన్ వెలువడలేదు. ప్రస్తుతం నోటిఫికేషన్ వేసినా వయసు పైబడి అర్హత కోల్పోయా. వయసు సడలిస్తే అవకాశం ఉంటుంది. ప్రభుత్వం ఈ దిశగా ఆలోచించాలి.

- వెంకట రమణ

గ్రామస్థాయి నుంచి జనసేన పార్టీని బలోపేతం చేయాలి



ఉదయగిరి రూరల్: విలేకరులతో మాట్లాడుతున్న అజయకుమార్



సంగంలో ర్యాలీ నిర్వహిస్తున్న జనసేన, టీడీపీ నాయకులు

ఉదయగిరి రూరల్, ఫిబ్రవరి 18: ప్రతి కార్యకర్త ఓ సైనికుడిలా పనిచేసి గ్రామస్థాయి నుంచి జనసేన పార్టీని బలోపేతం చేయాలని ఆ పార్టీ జాతీయ మీడియా అధికార ప్రతినిధి వేములపాటి అజయకుమార్ పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని జీ చెర్లోపల్లి గ్రామంలో పార్టీ జెండాను ఆవిష్క రించారు. అనంతరం ఆయన విలేఖరులతో మాట్లాడుతూ దోచుకొని దాచుకోవడం జనసేన పార్టీ అధినేత పవన్‌కల్యాణ్‌కు తెలియదన్నారు. రాబోయే ఎన్నికల్లో టిక్కెట్ ఎవరికి వచ్చినా జనసేన, టీడీపీ కూటమి అభ్యర్థి విజయానికి సహకరించాలన్నారు. మెట్ట ప్రాంతమైన ఉదయగిరి నియోజకవర్గం అన్నిరంగాల్లో అభివృద్ధి చెందాలంటే మంచి వ్యక్తికి ఓటేసి గెలిపించాలన్నారు. రాష్ట్రంలో జనసేన పార్టీకి రోజురోజుకు ఆదరణ పెరుగుతోందన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు భోగినేని కాశీరావు, కుర్రా కృష్ణయాదవ్, కొలికొండ శశిధర్, అల్లూరి రవీంద్ర, సురేందర్‌రెడ్డి, పిట్ల కిరణ్, సత్యనారాయణ, పీ.శ్రీనివాసులు, తిరుపతయ్య, రత్నయ్య తదితరులు పాల్గొన్నారు.

సంగం: జనసేన పార్టీ బలోపేతమే లక్ష్యంగా జనసైనికులు కృషి చేయాలని అజయ్ కుమార్ పిలుపునిచ్చారు. ఆదివారం సంగంలో ఆ పార్టీ జెండా ఆవిష్కరణ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా బస్టాండ్ సెంటర్ నుంచి బంగ్లా సెంటర్ వరకు జనసైనికులతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పార్టీ అధినేత అడుగుజాడల్లో జనసైనికులు నడవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జనసేన ఆత్మకూరు నియోజకవర్గ ఇన్‌చార్జి నలిశెట్టి శ్రీధర్, మండల నాయకులు ఆనంద్, భాను, టీడీపీ నాయకులు మంజులనాయుడు, విజయకృష్ణారెడ్డి, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సిమెంట్ రోడ్డు నిర్మాణ పనుల ప్రారంభం



సిమెంట్ రోడ్డు పనులు చేయిస్తున్న సర్పంచి

సీతారామపురం, ఫిబ్రవరి 18: మండలంలోని సీతారామపురం బిట్-1 సచివాలయ పరిధిలోని తోట కాలనీలో ఆదివారం సర్పంచ్ భాగ్యకుమారి ఆధ్వర్యంలో సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా భాగ్యకుమారి మాట్లాడుతూ పంచాయతీలో నిధులు లేకపోవడం వల్ల చేసిన పనులకు ఇంతవరకు బిల్లులు రాలేదని, అయినప్పటికీ ప్రజలు అవస్థలు పడకూడదని సిమెంట్ రోడ్లు వేస్తున్నామని తెలిపారు.

ఎన్నికల విధులపై శిక్షణ

ఉదయగిరి, ఫిబ్రవరి 18: స్థానిక మేకపాటి గౌతంరెడ్డి ప్రభుత్వ వ్యవసాయ కళాశాలలో ఆదివారం ఎన్నికల విధులపై శిక్షణ నిర్వహించారు. నియోజకవర్గం లోని ఎనిమిది మండలాలకు చెందిన సెక్టార్ అధికారులు, పోలీసులకు రానున్న సార్వత్రిక ఎన్నికల్లో తీసుకోవాల్సిన విధి విధానాలపై శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఉదయగిరి నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి రాజారమేష్‌ప్రేమ్‌కుమార్, కావలి డీఎస్పీ వెంకటరమణ, సీఐ గిరిబాబు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పేద కుటుంబానికి ఆర్థిక సాయం

అనంతసాగరం, ఫిబ్రవరి 18: మండలంలోని పడమటికంబంపాడు గ్రామానికి చెందిన కత్తి వెంకటరమణయ్య లివర్ వ్యాధితో బాధపడుతుండగా అతని ఆరోగ్యం మెరుగు కోసం ఆదివారం హెల్పింగ్ హార్ట్స్ స్వచ్ఛంద సంస్థ రూ. 20 వేలు ఆర్థిక సహాయం చేశారు. కార్యక్రమంలో సభ్యులు పెంచలయ్య, సురేష్, చిన్నయ్య, శివయ్య తదితరులు పాల్గొన్నారు.

'టీఆర్‌ఆర్'లో రీసెర్చ్ సెంటర్ల ఏర్పాటు

కందుకూరు, ఫిబ్రవరి 18: స్థానిక టీఆర్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆంధ్రకేసరి యూనివర్సిటీ పరిధిలో రీసెర్చ్ సెంటర్లను కేటాయించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టరు ఎం.రవికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఫిజిక్స్, లైఫ్ సైన్సెస్, ఇంగ్లీష్, ఎకనామిక్స్ డిపార్ట్‌మెంట్లలో రీసెర్చ్ సెంటర్లు ఏర్పాటు చేసి ఆయా విభాగాలలో పనిచేస్తున్న డాక్టరేట్ అధ్యాపకులను రీసెర్చ్ గైడ్‌లుగా గుర్తించారని తెలిపారు. ఇటీవలే ఇతర యూనివర్సిటీలకు చెందిన ప్రొఫెసర్ల బృందం కళాశాలను సందర్శించి ఆయా డిపార్ట్‌మెంట్లలోని మౌలిక వసతులను పరిశీలించి యూనివర్సిటీకి అందజేసిన నివేదిక మేరకు రీసెర్చ్ సెంటర్లను ఏర్పాటు చేశామని తెలిపారు. ఆంధ్రకేసరి యూనివర్సిటీ పరిధిలో ఉన్న అన్ని కళాశాలల్లో అత్యధికంగా టీఆర్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 16మంది డాక్టరేట్ పొందిన అధ్యాపకులు పనిచేస్తున్నారని గత ఆరేళ్లకాలంలో కళాశాలకు చెందిన అధ్యాపకులు 100కి పైగా పరిశోధనా పత్రాలను జాతీయ, అంతర్జాతీయ జర్నల్స్‌లో ప్రచురించారని ప్రస్తుతం రీసెర్చ్ సెంటర్ల ఏర్పాటుతో పరిశోధనలు మరింత ఊపందుకుంటాయని ఆయన పేర్కొన్నారు.

ఉదయగిరిలో గడప గడపకు మన ప్రభుత్వం

ఉదయగిరి, ఫిబ్రవరి 18: పట్టణంలోని మంగళకట్ట, శ్రీనగర్‌కాలనీ, యూనియన్‌రోడ్డు తదితర ప్రాంతాల్లో ఉదయగిరి వైసీపీ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్ రెడ్డి ఆదివారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల వైసీపీ కన్వీనర్ జీ ఓబులరెడ్డి, జడ్పీ కోఆప్షన్ సభ్యులు తాజుద్దీన్, ఎంపీటీసీ గొల్లపల్లి తిరుపతి, మాజీ మండల వైసీపీ కన్వీనర్ అక్కి భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆత్మీయ సమావేశం

నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి ఆదివారం ఉదయగిరి సర్పంచ్ సామ్రాజ్యం, ఎంపీటీసీ షేక్ పెదమస్తానీఎస్థాన్, ఉప సర్పంచ్ ముర్తుజాహుస్సేన్‌ల ఆధ్వర్యంలో దుర్గంపై ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల వైసీపీ కన్వీనర్ జీ ఓబులరెడ్డి, నాయకులు అక్కులరెడ్డి, యస్థానీ, ఉప్పుటూరి శ్రీనివాసులు పాల్గొన్నారు.

మేకపాటి గౌతంరెడ్డి వర్ధంతి ఏర్పాట్ల పరిశీలన

ఉదయగిరి రూరల్: స్థానిక మేకపాటి గౌతంరెడ్డి ప్రభుత్వ వ్యవసాయ కళాశాలలో బుధవారం నిర్వహించే దివంగత మంత్రి మేకపాటి గౌతంరెడ్డి రెండో వర్ధంతి కార్యక్రమ ఏర్పాట్లను ఆదివారం ఉదయగిరి నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అసోసియేట్ డీన్ టీ గోపికృష్ణ, మండల వైసీపీ కన్వీనర్ జీ ఓబులరెడ్డి, జడ్పీ కోఆప్షన్ సభ్యుడు తాజుద్దీన్, నాయకులు అక్కి భాస్కర్‌రెడ్డి, శ్రీనివాసులరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు 8, 9, 10వ తరగతి విద్యార్థులకు టెక్ ఫెయిర్

ఆత్మకూరు, ఫిబ్రవరి 18: స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఆత్మకూరు మున్సిపాల్టీ, మండలంలోని అన్ని పాఠశాలల 8, 9, 10వ తరగతి విద్యార్థులకు సోమవారం సాంకేతిక విద్యపై టెక్ ఫెయిర్ ద్వారా అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ బి నాగేశ్వరరావు తెలిపారు. సాంకేతిక విద్యతో ఉజ్వల భవిష్యత్ ఏర్పరుచుకోవచ్చని, 10వ తరగతి అనంతరం పాలిటెక్నిక్ సరైన మార్గమని అవగాహన కల్పించాలనే లక్ష్యంతో టెక్ ఫెయిర్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కావున విద్యార్థులందరు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

సత్తెమ్మకు వైభవంగా పాల పొంగళ్లు



ఊరేగింపుగా పూజాసామగ్రితో ఆలయానికి వస్తున్న భక్తులు

కలువాయి, ఫిబ్రవరి 18: మండలంలోని అగ్రహారంలో గ్రామదేవత సత్తెమ్మకు ఆదివారం పాల పొంగళ్లు వైభవంగా నిర్వహించారు. గ్రామంలోని ప్రతి ఇంటి నుంచి పూజా సామాగ్రి తీసుకుని మహిళలు మేళతాళాలతో ఆలయానికి చేరుకుని అమ్మవారికి పొంగళ్లు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు. వెంకటగిరి మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అమ్మవారిని దర్శించుకున్నారు. వివిధ గ్రామాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.

నేడు, రేపు వేలం పాటలు

దుత్తలూరు(ఉదయగిరి రూరల్), ఫిబ్రవరి 18: మండలంలోని నర్రవాడలో ఉన్న శ్రీవెంగమాంబ పేరంటాలమ్మ ఆలయ ఆవరణలో సోమ, మంగళవారాల్లో 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి వివిధ అంశాలపై బహిరంగ వేలంపాటలు నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వాహణాధికారి ఉషశ్రీ ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. పాటలో పాల్గొనేవారు ఆయా అంశాలకు సంబంధించి నిర్ణయించిన నగదును ధరావత్తు కింద చెల్లించాలన్నారు. పాట దక్కించుకున్న వారు 1.4.2024 నుంచి 31.3.2025 వరకు హక్కు కలిగి ఉంటారన్నారు. మరిన్ని వివరాలకు కార్యాలయంలో సంప్రదించాలని ఆమె కోరారు.

వైసీపీకి బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్ధం : బీజేపీ



మాట్లాడుతున్న భరత్‌కుమార్ యాదవ్

ఉదయగిరి రూరల్, ఫిబ్రవరి 18: రాష్ట్రంలో రాక్షస పాలన సాగిస్తున్న వైసీపీ ప్రభుత్వానికి ప్రజలు బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గుండపల్లి భరత్‌కుమార్‌యాదవ్ పేర్కొన్నారు. ఆదివారం రాత్రి స్థానిక బీజేపీ కార్యాలయంలో కార్యకర్తలతో సమీక్షించారు. అనంతరం ఆయన విలేఖరులతో మాట్లాడుతూ జిల్లాలో వైసీపీ ఖాళీ అవుతోందన్నారు. పార్లమెంట్ స్థానానికి కూడా అభ్యర్థి దొరకడం లేదన్నారు. కేంద్ర ప్రభుత్వం పంచాయతీలకు జమ చేస్తున్న నిధులను సైతం స్వాహా చేసిన ఏకైక ప్రభుత్వం వైసీపీయేనన్నారు. ప్రజల సొమ్మును స్వాహా చేసిన వైసీపీ ఎమ్మెల్యేలు డబ్బు సంచులతో మళ్లీ ప్రజల వద్దకు ఓట్ల కోసం వస్తున్నారని, వారికి తగిన బుద్ధి చెప్పాలన్నారు. ఉదయగిరి నియోజకవర్గంలో అభివృద్ధి ఊసే లేదన్నారు. నియోజకవర్గంలో జరుగుతున్న జాతీయ రహదారుల నిర్మాణం కేంద్ర ప్రభుత్వం చలువేనన్నారు. రానున్న ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థుల విజయానికి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ బీజేపీ కన్వీనర్ కదిరి వెంకటరంగారావు, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు పులిచర్ల నారాయణరెడ్డి, మండల బీజేపీ అధ్యక్షుడు నెల్లూరు వెంకటస్వామినాయుడు, నాయకులు మేకపాటి మాల్యాద్రినాయుడు, షాజహాన్, వెంకటేశ్వర్లు, చల్లా సుబ్బరత్నం తదితరులు పాల్గొన్నారు.

నేడు యాదవ చైతన్య వేదిక నిర్మాణానికి శంకుస్థాపన



మాట్లాడుతున్న రామాంజనేయులు

దుత్తలూరు (ఉదయగిరి రూరల్), ఫిబ్రవరి 18: దుత్తలూరు-నర్రవాడ గ్రామాల మధ్యలో 565 జాతీయ రహదారి పక్కన యాదవ చైతన్య వేదిక నిర్మాణానికి సోమవారం శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించనున్నట్లు స్థల దాత, ఉదయగిరి జడ్పీటీసీ మోడి రామాంజనేయుల యాదవ్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన విలేఖరులతో మాట్లా డుతూ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు, మాజీ మంత్రులు అనిల్‌కుమార్‌యాదవ్, రఘువీరారెడ్డి, మాజీ జడ్పీ చైర్మన్ చెంచలబాబుయాదవ్, నేతలు బోడె రామచంద్రయాదవ్, ఆవుల వెంకట్రామయ్య, పలువురు ప్రజాప్రతినిధులు, ప్రముఖులు హాజరవుతారన్నారు. శంకుస్థాపన అనంతరం శ్రీకృష్ణ ఆరాధన తదితర కార్యక్రమాలు ఉంటాయన్నారు. నియోజకవర్గంలోని యాదవ సోదరులంతా అధికసంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

వ్యాయామ ఉపాధ్యాయుడిని తొలగించాలి : సీపీఎం



విలేకరులతో మాట్లాడుతున్న సీపీఎం నాయకుడు కాకు వెంకటయ్య

సీతారామపురం, ఫిబ్రవరి 18 : విద్యార్థుల పట్ల నీచంగా వ్యవహరించిన స్థానిక ఏపీ మోడల్ స్కూల్ వ్యాయామ ఉపాధ్యాయుడిని ఉద్యోగం నుండి శాశ్వతంగా తొలగించే వరకు మా పోరాటం ఆగదని సీపీఎం నాయకుడు కాకు వెంకటయ్య అన్నారు. ఆదివారం స్థానిక ఎంపీడీవో కార్యాలయ ప్రాంగ ణంలో జరిగిన విలేఖరుల సమా వేశంలో మాట్లాడుతూ ఇప్పటి నుంచైనా మోడల్ స్కూల్‌కి చెడ్డ పేరు రాకుండా ప్రిన్సిపాల్ చూసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కొడె రమణయ్య, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఎండుతున్న ఆరుతడి పంటలు !

● 'రాళ్లపాడు' జలాలు ఇవ్వాలని రైతుల వేడుకోలు



అన్నెబోయినపల్లి సమీపంలో సాగు చేసిన పత్తి

లింగసముద్రం, ఫిబ్రవరి 18 : రాళ్లపాడు ఆయకట్టు పరిధిలో సాగు చేసిన ఆరుతడి పంటలు నీటి ఎద్దడితో ఎండుముఖం పడుతున్నాయి. ఈ క్రమంలో రాళ్లపాడు ప్రాజెక్టులోని నీటిని ఇచ్చి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు. మండలంలో తీవ్ర వర్షాభావ పరిస్థితులు ఏర్పడి గత ఏడాది నవంబరు చివర్లో అరకొరగా వర్షాలు కురిశాయి. దీంతో ప్రాజెక్టులోకి కేవలం 14 అడుగుల నీరు మాత్రమే చేరింది. దీంతో రైతులు ఆయకట్టు పరిధిలో వరి పైరు సాగు చేయకుండా పత్తి, శనగ, తదితర పంటలు సాగు చేశారు. అప్పటి నుంచి వర్షాలు కురవలేదు. దీంతో మండలంలో తీవ్ర వర్షాభావ పరిస్థితులు ఏర్పడ్డాయి. సాగు చేసిన ఆరుతడి పంటలు వాడు ముఖం పడుతున్నాయి. ప్రస్తుతం ప్రాజెక్టులో 12.1 అడుగుల నీరు ఉంది. ఆరుతడి పంటలు ఎండిపోకుండా రాళ్లపాడు ప్రాజెక్టులోని నీటిని కాలువలకు విడుదల చేయాలని సంబంధిత జిల్లా అధికారులతో పాటు ప్రాజెక్టు అధికారులను రైతులు కోరుతున్నారు. ఆ దిశగా చర్యలు తీసుకోవాలని మొరపెట్టుకుంటున్నారు.

కావలి

కందుకూరు, ఆత్మకూరు, ఉదయగిరి

పేకాట శిబిరంపై దాడి

ఉలవపాడు, ఫిబ్రవరి 18 : మండలంలోని రాజుపాలెం సమీప మామిడి తోటలో నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై ఆదివారం పోలీసులు దాడులు చేశారు. ఏడుగురుని అదుపులోకి తీసుకొని రూ.16,400 స్వాధీనం చేసుకున్నారు. వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై బాజీరెడ్డి తెలిపారు.

ఉపాధి కల్పన, అభివృద్ధికి చిరునామా చంద్రబాబు

● టీడీపీ కావలి ఇన్‌చార్జి కావ్య క్రిష్ణారెడ్డి



మాట్లాడుతున్న టీడీపీ కావలి ఇన్‌చార్జి కావ్య క్రిష్ణారెడ్డి

కావలి, ఫిబ్రవరి 18: రాష్ట్రాభివృద్ధికి, యువతకు ఉపాధి కల్పనకు చిరునామా టీడీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అని టీడీపీ కావలి నియోజకవర్గ ఇన్‌చార్జి కావ్య క్రిష్ణారెడ్డి పేర్కొన్నారు. కావలి రూరల్ మండలం తుమ్మలపెంటలో శనివారం రాత్రి ఆయన మత్స్యకారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మత్స్యకారులు తమ సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. గత టీడీపీ ప్రభుత్వంలో మత్స్యకారులకు వలలు, బోట్లు, ఇతర పథకాలు ఇచ్చేవారని, ఈ ప్రభుత్వంలో ఎలాంటి పథకాలు వర్తింపచేయడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఆక్వారంగం పూర్తిగా దెబ్బతిందని, సముద్రంలో మత్స్యసంపద తగ్గుతుండడంతో మత్స్యకారుల జీవన ప్రమాణాలు సన్నగిల్లుతున్నాయన్నారు. తీరప్రాంతాల ప్రజలు రాకపోకలు సాగించే కావలి-తుమ్మలపెంట రోడ్డు అధ్వానంగా ఉన్నా దానిని వేయలేని దుస్థితిలో ఎమ్మెల్యే ఉన్నారన్నారు. టీడీపీకి కంచుకోటగా ఉన్న తుమ్మలపెంటపై కక్ష్య సాధింపు చర్యలు చేపడుతున్నారన్నారు. ఈ కర్యాక్రమంలో రూరల్ మండల అధ్యక్షుడు ఆవుల రామకృష్ణ పాల్గొన్నారు.

తారకరత్నకు నివాళి : నందమూరి తారకరత్న ప్రథమ వర్ధంతి సందర్భంగా ముసునూరులోని టీడీపీ కార్యాలయంలో ఆదివారం ఇన్‌చార్జి కావ్య క్రిష్ణారెడ్డి ఆధ్వర్యంలో తారకరత్న చిత్రపటానికి పూలమాల వేసి టీడీపీ నేతలు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి మలిశెట్టి వెంకటేశ్వర్లు, పట్టణ అధ్యక్షుడు గుత్తికొండ కిషోర్, ప్రధాన కార్యదర్శి జ్యోతి బాబూరావు, పోతుగంటి శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలో పలువురి చేరిక : కావలి రూరల్ మండలం రాజువారి చింతలపాలెం, చెంచుగాని పాలెంకు చెందిన పలువురు వైసీపీ నేతలు పేముల మాల్యాద్రి, నాసిన జ్వాలరావు, పోసిన శ్రీనివాసులు, జ్యోతి బాబూరావు, జ్యోతి వేణుల ఆధ్వర్యంలో టీడీపీలో చేరగా వారికి క్రిష్ణారెడ్డి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు.

వైసీపీ నుంచి టీడీపీలోకి పలువురి చేరిక



టీడీపీలో చేరిన ఎస్సీ కాలనీ యువకులతో ఇంటూరి నాగేశ్వరరావు

కందుకూరు, ఫిబ్రవరి 18: మండలంలోని పలుకూరు ఎస్సీ కాలనీకి చెందిన పలువురు వైసీపీని వీడి ఆదివారం తెలుగుదేశం పార్టీలో చేరారు. మండల పార్టీ అధ్యక్షుడు నార్నె రోశయ్య, గ్రామ పార్టీ అధ్యక్షుడు బొద్దులూరి కొండలరావుల ఆధ్వర్యంలో వీరంతా స్థానిక పార్టీ కార్యాలయానికి వచ్చి నియోజకవర్గ ఇన్‌చార్జి ఇంటూరి నాగేశ్వరరావు సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. వారందరికీ టీడీపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించిన నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రతి ఒక్కరికీ అండగా ఉంటానని, కష్టనష్టాలలో మీకు తోడుగా ఉంటానని, ఎప్పుడు ఏ సమస్య వచ్చినా నన్ను సంప్రదించవచ్చునని పేర్కొన్నారు.

రక్తదానం చేసి ప్రాణదాతలు కండి !

కలిగిరి, ఫిబ్రవరి 18 : రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని జన విజ్ఞాన వేదిక జిల్లా గౌరవాధ్యక్షుడు మేడం పెంచల నరసింహారెడ్డి పేర్కొన్నారు. స్థానిక ఎంపీపీ పాఠశాలలో ఆదివారం మమతా రక్త సహాయ శిబిరం ద్వారా 40 మంది రక్తదాతలు నోవా బ్లడ్ బ్యాంక్ వారికి రక్తదానం చేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ ప్రస్తుతం సమాజంలో రక్తదానంపై అపోహలు తొలగి యువత కూడా రక్తదానినికి ముందుకు రావడం సంతోషకరమైన పరిణామమన్నారు. ఈ కార్యక్రమంలో జేవీవీ సభ్యులు పీవీ.కృష్ణమూర్తి, పీసీ.మంజున్‌రావు, జీ.వెంకటేశ్వర్లు, ఎం.పోలయ్య, ప్రభాకర్ రెడ్డి, లక్ష్మీనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైల్వే కార్మికుల రక్తదానం

బిట్రగుంట : బిట్రగుంట రైల్వే స్టేషన్లో ఆల్ ఇండియా గార్డ్స్ కౌన్సెలింగ్ ఫౌండేషన్ డే సందర్భంగా ఆదివారం రైల్వే కార్మికుల రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఏఐజీసీ బిట్రగుంటబ్రాంచ్ కార్యదర్శి విజయభాస్కర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఒంగోలు, గూడూరు రైల్వే వైద్యులు ఎల్‌వీ రమణారావు, ఎస్ఎస్ కుమార్, బిట్రగుంట స్టేషన్ మాష్టరు మురళీధర్‌రెడ్డి, బిట్రగుంట బ్రాంచ్ అధ్యక్షుడు మిట్టా మురళీకృష్ణ, కార్యదర్శి శ్రీనివాసులు, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

రేషన్ సరుకుల పంపిణీ

బిట్రగుంట, ఫిబ్రవరి 18: ప్రభుత్వం ప్రజలకు ప్రతి నెల అందచేస్తున్న రేషన్ సరుకులు సక్రమంగా పంపిణీ చేయకపోతే చర్యలు తీసుకుంటామని డీఎస్‌వో వెంకటరమణ అన్నారు. బోగోలు మండలం విశ్వనాథరావుపేట పంచాయతీ కొత్తూరులోని 8వ రేషన్ షాపు నిర్వాహకులు ఆరు నెలలుగా రేషన్ సక్రమంగా ఇవ్వడం లేదన్న ఆరోపణలపై జిల్లా అధికారులు స్పందించారు. ఈ క్రమంలో ఆదివారం కొత్తూరుతో క్షేత్రస్థాయి విచారణ చేపట్టారు. రేషన్ షాప్ డీలర్‌కు ఫోన్ చేసినా స్పందించకపోవడంతో విశ్వనాథరావుపేట, తాళ్లూరు గ్రామాల్లోని డీలర్ల వద్ద నుంచి బియ్యం, చక్కెర తీసుకువచ్చి లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఆయన వెంట ఏఎస్‌వో అంకయ్య, డీటీ మల్లికార్జున, పీఎంయు వెంకట్, వీఆర్వో మల్లికార్జునరావు తదితరులు ఉన్నారు.

అధిష్ఠానం నిర్ణయం మేరకు పనిచేయాలి

బిట్రగుంట, ఫిబ్రవరి 18: తెలుగుదేశం పార్టీ అధిష్ఠానం నిర్ణయం మేరకు ప్రతి కార్యకర్త కష్టపడి పనిచేయాలని ఆ పార్టీ మండల కన్వీనర్ మాలేపాటి నాగేశ్వరావు సూచించారు. బోగోలు టీడీపీ కార్యాలయంలో ఆదివారం మండల కార్యకర్తల సమావేశం జరిగింది. సోమవారం కావలిలో జరిగే నియోజకవర్గస్థాయి సమావేశాన్ని, బుధవారం బోగోలులో జరుగు విస్తృత స్థాయి సమావేశాలను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కోడూరువెంకటేశ్వర్లు రెడ్డి, ఎల్.సుధీర్‌బాబు, యర్రం వెంకటేశ్వర్లురెడ్డి, గద్దే కొండయ్య, కడియాల గోవిందు, చల్లా క్రాంతి, మనోహర్, పుట్టా సుబ్బారావు, అహ్మద్‌బాషా, సుబ్బారెడ్డి, వాయిల శీనయ్య తదితరులు పాల్గొన్నారు.

'జూపూడి అవకాశవాది'

బిట్రగుంట, ఫిబ్రవరి 18: విదేశీ విద్యకు జగన్‌పేరు పెట్టడం తప్పులేదని జూపుడి అనడం అవకాశవాదమే అని దళిత సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షుడు ఎస్.మల్లి అన్నారు. జూపుడి మాటలను ఖండిస్తూ దళితులతో కలసి ఆదివారం బోగోలులో అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. రాజ్యాంగ నిర్మాతకు బాబాసాహెబ్ విగ్రహానికి పూలమాల వేసి వినతిపత్రం అందచేశారు. అనంతరం ఆయన మాట్లాడుతు పీడిత ప్రజల ఆశాజ్యోతి బీఆర్ అంబేడ్కర్ పేరు అవసరం లేదని, వైఎస్‌జగన్ పేరు పెడితే ప్రపంచమంతా తెలుస్తుందని గుంట నక్క జూపుడి ఆలోచన్నారు. నాలుగు డబ్బులు సంపాదించేందుకు ఏ ఎండకు ఆ గొడుగు ఎత్తడం జూపుడి ప్రభాకర్ నైజమన్నారు. జగన్ దళితులకు సంబంధించి 27 సంక్షేమ పథకాలు తీసివేస్తే అది అన్యాయమని అడగ లేని పెద్దమనిషి జూపుడి అని దుయ్యబట్టారు. ఈ విషయమై దళిత సంఘాల నేతలు అందరు ఖండిచాలని కోరారు. ఈ కార్యక్రమంలో దుగ్గిరాల తిరువళ్లూరు, సాదుప్రసాద్, ఆత్మకూరి తేజ, తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న దళితనేతలు

జనసేన, టీడీపీ ప్రభంజనంలో వైసీపీ గల్లంతే..

● జనసేన పొలిట్‌బ్యూరో సభ్యుడు ఆరంఖాన్



జనసేన కార్యాలయం ప్రారంభోత్సవంలో నేతలు

కావలిటౌన్, ఫిబ్రవరి 18: జనసేన, టీడీపీ ప్రభంజనంలో వైసీపీ గల్లంతవ్వడం ఖాయమని జనసేన పొలిట్‌బ్యూరో సభ్యుడు ఆరంఖాన్ పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని తుమ్మలపెంట రోడ్డు వద్ద ఏర్పాటు చేసిన నియోజకవర్గ పార్టీ కార్యాలయం ప్రారంభోత్సవం ఆపార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి అళహరి సుధాకర్ ఆధ్వర్యంలో అట్టహాసంగా జరిగింది. ముందుగా జెండాచెట్టు వద్ద నుంచి జనసేన రాష్ట్ర నేతలతో కలసి భారీ బైక్‌ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆరంఖాన్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అజయ్‌కుమార్‌తో కలిసి కార్యాలయాన్ని ప్రారంభించారు. అనంతరం వారు విలేకర్లతో మాట్లాడుతూ జనసేన, టీడీపీ ఉమ్మడి అభ్యర్థిగా చిన్న కార్యకర్త పోటీ చేసినా గెలుస్తారన్నారు. జిల్లా అధ్యక్షుడు మనుక్రాంత్ రెడ్డి, అళహరి సుధాకర్‌లు మాట్లాడుతూ కావలిలో రోడ్లు చూస్తే వైసీపీ చేసిన అభివృద్ధి అద్దం పడుతుందన్నారు. కార్యక్మంలో ఎన్ఆర్ఐ కోఆర్డినేటర్ శశిధర్, రాష్ట్ర అధికారప్రతినిధి రావిపాటి అశోక్, తాతంశెట్టి నాగేంద్ర, ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

యానాదులకు ప్రభుత్వం చేసింది శూన్యం

● యానాది సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు



యానాదులతో మాట్లాడుతున్న పెంచలయ్య

అల్లూరు, ఫిబ్రవరి 18 : రాష్ట్ర ప్రభుత్వం యానాదులకు చేసింది శూన్యమేనని యానాది సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసీ.పెంచలయ్య అన్నారు. అల్లూరు మండలం బట్రకాగొల్లులో యానాదులతో ఆయన ఆదివారం సాయంత్రం ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన తన సభ్యులతో కలసి యానాదుల ఇళ్లకు వెళ్లి వారి సమస్యలు అడిగి తెలుసుకుని మాట్లాడుతూ తాగునీటికి నేటికీ బావులపై ఆధారపడి ఉన్నారన్నారు. జగనన్న ఇళ్లు కట్టకుండానే బిల్లులు డ్రా చేశారని ఆయన విమర్శించారు. ఉమ్మడి నెల్లూరు జిల్లాలో 4 లక్షల మంది యానాదుల సమస్యలను తెలుసుకునే కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా చైర్మన్ రాపూరి కృష్ణయ్య, జిల్లా అధ్యక్షుడు మావులూరి మురళి, మహిళా నాయకులు చెంబేటి ఉష, ఇండ్ల రమ్య తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా శైవక్షేత్రాల నిర్మాణానికి శంకుస్థాపన



ఆలయ నిర్మాణ భూమిపూజలో పండితులు

బిట్రగుంట, ఫిబ్రవరి 18: బోగోలు పంచాయతీ మణికంఠ నగర్‌లో శైవక్షేత్రాల నిర్మాణానికి ఆదివారం శాస్త్రోక్తంగా శంకుస్థాపన కార్యక్రమాలను శైవాగమ పండితులు వెంకటసుబ్బయ శర్మ బృందం ఆధ్వర్యంలో జరిగాయి. విఘ్నేశ్వర సుబ్రహ్మణ్య అయ్యప్ప స్థలం ఆవరణలో విశ్వేశ్వర అన్నపూర్ణ సమేత శివాలయం, అయ్యప్ప ఆలయాలకు శంకుస్థాపన కార్యక్రమాలు జరిగాయి. విఘ్నేశ్వరపూజ, మండపారాధన, వాస్తు పూజ, శివపార్వతుల శాంతి హోమ కార్యక్రమాలు పండితులు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బచ్చు అమరా ట్రస్ట్ సభ్యులు డాక్టర్ ఆనందసాగర్, సాయి సేవకులు ఐశ్వర్య, నీరజ, అశోక్, పీఎస్ఆర్ ట్రస్ట్ సభ్యులు వేంకటేశ్వర్లు, స్థానిక పెద్దలు తుమ్మల వెంకయ్య, తదితరులు పాల్గొన్నారు.

పట్టుదలతో చదివితేనే ఉత్తమ ఫలితాలు



నృత్యం చేస్తున్న విద్యార్థినులు

ఉలవపాడు, ఫిబ్రవరి 18 : పట్టుదలతో చదివితే 10వ తరగతి పరీక్షలలో ఆశించిన మార్కులు పొందవచ్చని మండల విద్యాశాఖ అధికారి ప్రసాదరావు అన్నారు. ఆదివారం ఉలవపాడులోని శ్రీసాయి హైస్కూల్‌లో 10వ తరగతి విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమం జరిగింది. ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఏంఈవో పబ్లిక్ పరీక్షలలో పాటించవలసిన నియమాలు గురించి వివరించారు. అదేవిధంగా రాష్ట్ర వైఎస్ఆర్‌టీఎఫ్ గౌరవ అధ్యక్షుడు కేశవరపు జాలిరెడ్డి, కరస్పాండెంట్ కేశవరపు శేషమ్మలు మాట్లాడుతూ ఈ ఏడాది ఉత్తమ ఫలితాలు రాబట్టాలని విద్యార్థులను ఆశీర్వదించారు. అనంతరం ఆట పాటలు, నృత్యాలతో విద్యార్థులు అలరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నూరుబాషాలకు చట్టసభల్లో ప్రాధాన్యం కల్పించాలి



మాట్లాడుతున్న నూర్‌బాషా సంఘం నేత చెన్నయ్య

కావలి, ఫిబ్రవరి 18: నూరుబాషా(దూదేకుల)లకు చట్టసభల్లో ప్రాధాన్యం కల్పించాలని నూర్‌బాషా సంఘం నాయకులు కోరారు. పట్టణంలోని రామిరెడ్డితోట కల్యాణ మండపంలో ఆదివారం నూరుబాషా సంఘం ఆత్మీయ సమావేశం, వనభోజన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా సంఘనాయకులు మాట్లాడుతూ రాష్ట్రంలో 23 లక్షల మంది నూరుబాషాలు ఉన్నప్పటికీ ఇప్పటి వరకు ఏ రాజకీయ పార్టీ కూడా చట్టసభలకు పోటీ చేసేందుకు అవకాశం ఇవ్వలేదన్నారు. రాబోయే ఎన్నికలలో 2 పార్లమెంట్, 5 అసెంబ్లీ స్థానాలను కేటాయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు షేక్ సలీం, షేక్ చెన్నయ్య, మహబూబ్ బాషా, మీరా సాహెబ్, హుస్సేన్ సాహెబ్, మస్తాన్ వలీ, షరీఫ్, షాహినా, దిల్షాద్, ఖలీల్, చాంద్‌బాషా, షాన్‌వాజ్, రఫీ, మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

నూతన వధువుకు నేతల ఆశీర్వాదం

వలేటివారిపాలెం, ఫిబ్రవరి 18 : మండలంలోని శాఖవరంకు చెందిన వడ్లమూడి శ్రీహరిరావు - ధనమ్మల కుమార్తె చైతన్య వివాహ వేడుకలకు ఆదివారం టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఇంటూరి నాగేశ్వరరావు, టీడీపీ నెల్లూరు పార్లమెంటు ఉపాధ్యక్షుడు ఇంటూరి రాజేష్‌లు వేర్వేరుగా హాజరై నూతన వధువును ఆశీర్వదించారు. ఆ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు మాదాల లక్ష్మీనరసింహం, కూనిపాలెం సర్పంచు నవ్వులూరి రాజారమేష్, నాయకులు పిడికిటి వెంకటేశ్వర్లు, నవ్వులూరి వెంకటేశ్వర్లు, ఘట్టమనేని లక్ష్మీనరసింహం, వడ్లమూడి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నెల్లూరు సిటీ, రూరల్
కోవూరు, సర్వేపల్లి

గాంధీ ఆశ్రమంలో సర్వమత ప్రార్థనలు

ఇందుకూరుపేట, ఫిబ్రవరి 18 : మండలంలోని పల్లిపాడు పినాకినీ సత్యాగ్రహ గాంధీ ఆశ్రమంలో ఆదివారం సర్వమత ప్రార్థనలు జరిగాయి. ముందుగా కో కన్వీనర్ నెల్లూరు రవీంద్రారెడ్డి మహాత్మాగాంధీ, పొణక కనకమ్మ విగ్రహాలకు ఖాదీ వస్త్రం, నూలుమాలలు సమర్పించారు. అనంతరం మహాత్మాగాంధీ జీవిత విశేషాలను స్కూల్ విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో దార్ల సుబ్రహ్మణ్యం, స్కూల్ విద్యార్థులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

యూత్ కాంగ్రెస్ మండలాధ్యక్షుడిగా శశికుమార్



నియామక పత్రాన్ని అందజేస్తున్న కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు నక్క శివకుమార్

వెంకటాచలం, ఫిబ్రవరి 18: వెంకటాచలం మండలం యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఎం శశికుమార్‌ను నియమిస్తూ ఆదివారం సర్వేపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ పూల చంద్రశేఖర్ ఆదేశాల మేరకు కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు నక్క శివకుమార్ నియామక పత్రాన్ని అందజేశారు. అనంతరం మండలంలోని కసుమూరు పంచాయతీ పరిధిలోని దళితవాడలో ఇంటింటి ప్రచారం నిర్వహించి కరపత్రాలను పంపిణీ చేశారు.

కంటేపల్లిలో ఉచిత వైద్య శిబిరం

వెంకటాచలం, ఫిబ్రవరి 18 : మండలంలోని కంటేపల్లి గ్రామంలో ఆదివారం విక్రమ సింహపురి యూనివర్సిటీ జాతీయ సేవా పథకం, శ్రీవత్స చెస్ట్ అండ్ చిల్డ్రన్స్ క్లినిక్ వారి సౌజన్యంతో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో డాక్టర్ కె కల్యాణి ఊపిరితిత్తులు, శ్వాసకోస వ్యాధులకు, డాక్టర్ కె చిరంజీవి చిన్న పిల్లలు, పురిటి బిడ్డలకు సంబంధించిన వ్యాధులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ కె సునీత, సోషల్ వర్క్ అధ్యాపకుడు డాక్టర్ బీవీ సుబ్బారెడ్డి, ఎన్ఎస్ఎస్ వలంటీర్స్ తదితరులున్నారు.

ఘనంగా నానీలు, నవలల ఆవిష్కరణ

నెల్లూరు (సాంస్కృతికం), ఫిబ్రవరి 18 : పెన్నా రచయితల సంఘం ఆధ్వర్యంలో నగరంలోని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ హాలులో ఆదివారం జాతీయ స్థాయి నానీల పురస్కారం, డాక్టర్ జయప్రద నవలా పురస్కార సభ జరిగింది. పద్య కళాపరిషత్ అధ్యక్షుడు మెట్టు రామచంద్రప్రసాద్ అధ్యక్షత వహించారు. నానీల జాతీయ పురస్కారాలను ముక్కాల నరేంద్ర, తిప్పావజ్ఝల నరసింహమూర్తి, దుప్పటి రమేష్, చిన్ని నారాయణరావు, కోసూరు రత్నం, మద్దూరు శ్రీనివాసులుకు అందజేశారు. జయప్రద రాసిన విభిన్న శ్వాసలు కవితా సంపుటి, గంగిశెట్టి శివకుమార్ రాసిన ఒలికించీడు నవలను, నానీల తీరాన నానీల ఆవిష్కరణలు జరిగాయి. ఈ కార్యక్రమంలో సాహితీకారులు అవ్వారు శ్రీధర్‌బాబు, మహ జబీన్, పెరుగు రామకృష్ణ, మోపూరు పెంచలనరసింహం, తోట సులోచన, ఏ జయప్రకాష్ పాల్గొన్నారు.

రేబాలలో శ్రీలీల స్టెప్పులు



స్టేజీ మీద స్టెప్పు వేస్తున్న శ్రీలీల

బుచ్చిరెడ్డిపాళెం, ఫిబ్రవరి 18: మండలంలోని రేబాల పంచాయతీ పరిధిలో ఆదివారం జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన సినీనటి శ్రీలీల ఓ పాటకు స్టెప్పులేసి యువతను ఉర్రూతలూగించారు. అనుకున్న సమయానికంటే గంట ఆలస్యంగా వచ్చిన ఆమెను అభిమానులు చుట్టుముట్టారు. అందరినీ ఆమె ఆప్యాయంగా పలుకరించారు. తిరుగు ప్రయాణంలో ఆమె కారు వెంట యువకులు పరుగులు తీయగా, వారిని అదుపు చేయడం పోలీసులకు సాధ్యం కాలేదు.

అశోక్‌కు చంద్రబాబు అభినందన



నెల్లూరు, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : 'బతుకు మారాలంటే - బాబు రావాలి' నినాదంతో ఇచ్ఛాపురం నుంచి తిరుమల వరకు పాదయాత్ర చేసిన నెల్లూరుకు చెందిన చింతల అశోక్ కుమార్‌ను టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు అభినందించారు. ఆదివారం ఉండవల్లిలోని నివాసంలో చంద్రబాబును అశోక్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పాదయాత్ర విశేషాలను తెలియజేశారు. ఇదే స్ఫూర్తితో భవిష్యత్‌లోనూ పార్టీ కోసం పనిచేయాలని అశోక్‌కు చంద్రబాబు సూచించారు.

పోలంరెడ్డి హయాంలో పార్లపల్లి సమగ్రాభివృద్ధి

● కోవూరు టీడీపీ ఇన్‌చార్జి దినేష్‌రెడ్డి



శ్మశాన వాటిక మరమ్మతులకు రూ.లక్ష చెక్కు సర్పంచుకు అందజేస్తున్న పోలంరెడ్డి దినేష్‌రెడ్డి

విడవలూరు, ఫిబ్రవరి 18: పోలంరెడ్డి శ్రీనివాసులరెడ్డి హయాంలో పార్లపల్లి సమగ్రాభివృద్ధి చెందిందని టీడీపీ కోవూరు నియోజకవర్గ ఇన్‌చార్జి పోలంరెడ్డి దినేష్‌రెడ్డి తెలిపారు. మండలంలోని పార్లపల్లిలో ఆదివారం ఆయన ప్రతి అడుగు ప్రజల కోసం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీల్లో పర్యటించి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. టీడీపీ మేనిఫెస్టో కరపత్రాలు అందజేశారు. ఆనంతరం శ్మశాన వాటిక మరమ్మతులకు లక్ష రూపాయిల చెక్కును గ్రామ సర్పంచు రామిశెట్టి స్వాతికి అందజేశారు. ఈ సందర్భంగా దినేష్‌రెడ్డి మాట్లాడుతూ పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి ఎమ్మెల్యేగా నియోజవర్గ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చేశారన్నారు. పార్లపల్లిలో సీసీరోడ్లు, అంగన్‌వాడీ భవనాలు, వాటర్‌ట్యాంకులు, తాగునీటి కుళాయిలు వేయించారన్నారు. అయన ఇచ్చిన స్ఫూర్తితో పార్లపల్లిలో స్థానిక సంస్థల ఎన్నికల్లో టీడీపీ ఘన విజయం సాధించిందన్నారు. చివరి ఆయకట్టుదారులు సాగునీరు లేక నానా ఇబ్బందులు పడుతుంటే కోవూరు ఎమ్మెల్యే ప్రసన్నకి నవ్వులాటగా ఉందన్నారు. కాలువ మరమ్మతులకు ప్రభుత్వం అందజేసిన రూ.5 కోట్ల నిధులు ఎక్కడ ఖర్చు చేశారని ప్రశ్నించారు. ఈ సందర్భంగా వైసీపీకి చెందిన కుడుముల రాజేష్, కుడుముల రవి, జానా ఆశోక్‌లు వారి అనుచరులతో కలసి టీడీపీలో చేరారు. వారికి దినేష్‌రెడ్డి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో నాయకులు చెముకుల కృష్ణచైతన్య, మాతూరు శ్రీనివాసులురెడ్డి, చెముకుల శ్రీనివాసులు, రామిశెట్టి వెంకటేశ్వర్లు, తాతా బాలకృష్ణ, ఆశోక్, ఇమాంబాషా, పూండ్ల ఏసోబు, ఇంతా మల్లారెడ్డి పాల్గొన్నారు.

సోమిరెడ్డి హయాంలోనే బ్రహ్మదేవి పంచాయతీ అభివృద్ధి



సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

ముత్తుకూరు, ఫిబ్రవరి 18: బ్రహ్మదేవి పంచాయతీలో అభివృద్ధి సోమిరెడ్డి హయాంలోనే జరిగిందని మండల టీడీపీ ఐటీ విభాగం నాయకుడు తిరుమలశెట్టి సతీష్‌నాయుడు స్పష్టం చేశారు. ఆదివారం బ్రహ్మదేవంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాజీ ఎంపీపీ నన్నం దీనయ్య, మైనారిటీ విభాగం నాయకుడు షేక్ ఆలీముత్తుతో కలిసి మాట్లాడుతూ స్థానిక వైసీపీ నాయకులకు కళ్లు మూసుకుపోయాయని, అందువల్లే టీడీపీ హయాంలో చేసిన అభివృద్ధి కనిపించలేదన్నారు. కాకాణి హయాంలో బ్రహ్మదేవిలో చేసిందేమీ లేదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు నాటరి నాగేంద్రబాబు, శివశంకర్, చలపతి, సురేష్, శివ, మురళి, పాపయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఓటమి భయంతో మంత్రి కాకాణి కొత్త డ్రామాలు



టీడీపీలో చేరిన వారితో సోమిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి

వెంకటాచలం, ఫిబ్రవరి 18 : ఓటమి భయంతోనే మంత్రి కాకాణి బోగస్ చేరికల పేరుతో కొత్త డ్రామాలు, ఫేక్ ప్రచారాలకు తెర లేపారని, వాటిని నమ్మే స్థితిలో సర్వేపల్లి ప్రజలు లేర ని సర్వేపల్లి నియోజకవర్గ టీడీపీ సమన్వయకర్త సోమిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి విమర్శించా రు. నెల్లూరులోని సోమిరెడ్డి క్యాంపు కార్యాలయంలో ఆదివారం వెంకటాచలం మండలం చెముడుగుంట గ్రామానికి చెందిన 50 కుటుంబాలు వైసీపీని వీడి రాజగోపాల్‌రెడ్డి సమక్షంలో టీడీపీలో చేరాయి. గుర్రం ప్రసాద్, మానికల భాను ఆధ్వర్యంలో టీడీపీలో చేరిన వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు గుమ్మడి రాజాయాదవ్, మండల కార్యదర్శి దొడ్ల అశోక్, తెలుగు యువత నేత ఉక్కల వినోద్, తదితరులున్నారు.

కంటైనర్ టెర్మినల్ తరలింపుపై వాస్తవాలు దాచేస్తున్నారు

ముత్తుకూరు, ఫిబ్రవరి 18 : కృష్ణపట్నం కంటైనర్ టెర్మినల్ చెన్నైకి తరలిపోతే జరిగే నష్టాన్ని ఇంటింటికీ తిరిగి వివరిస్తున్నామని సర్వేపల్లి నియోజకవర్గ టీడీపీ సమన్వయకర్త సోమిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి తెలిపారు. ముత్తుకూరులోని రాజీవ్‌నగర్ తాళ్లమ్మ గుడి వీధి, బ్రాహ్మణ వీధుల్లో ఆదివారం బాబు ష్యూరిటీ- భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమంలో పాల్గొన్నారు. టీడీపీ మండల అధ్యక్షుడు పల్లంరెడ్డి రామ్మోహన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి నీలం మల్లికార్జున్‌యాదవ్, తెలుగు యువత అధ్యక్షుడు ఈపూరు మునిరెడ్డిలతో కలిసి ఇంటింటికీ తిరిగి బాబు షూరిటీ కరపత్రాలతో పాటు కృష్ణపట్నం పోర్టుని కాపాడుదాం అంటూ కరపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఏదో ఒక నౌకను చూపించి మభ్యపెడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు బొలిగర్ల శ్రీనివాసులు, అక్కయ్యగారి ఏడుకొండలు, శంకర్, రాజు, తదితరులున్నారు.

పలువురు టీడీపీలో చేరిక

బుచ్చిరెడ్డిపాళెం, ఫిబ్రవరి 18: మండలంలోని కాళయకాగొల్లు పంచాయతీ, శ్రీరంగరాజపురం(బాపనపాడు)లో వైసీపీని వీడి 36 మంది యువకులు స్థానిక పెంచలరెడ్డి, ప్రసన్నకుమార్‌రెడ్డిల అధ్వర్యంలో టీడీపీ కోవూరు నియోజకవర్గ ఇన్‌చార్జి పోలంరెడ్డి దినేష్‌రెడ్డి సమక్షంలో ఆదివారం టీడీపీలో చేరారు. వారందరికీ దినేష్‌రెడ్డి టీడీపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో బత్తల హరికృష్ణ, చెముకుల చైతన్య, బండ్ల కొండయ్య, ప్రభాకర్‌రెడ్డి, రామానాయుడు, శంకర్, శివ, సరేంద్ర, గోపి, రవి, తదితరులు పాల్గొన్నారు.

చేనేత కుటుంబానికి ఆర్థిక సాయం



ఆర్థిక సహాయం అందజేస్తున్న దేవాంగ సంక్షేమ సంఘం నాయకులు

కోవూరు, ఫిబ్రవరి 18 : గుండెకు శస్త్ర చికిత్స చేయించుకున్న మండలంలోని గుమ్మళ్లదిబ్బ కాలనీకి చెందిన చేనేత కార్మికుడు మోదుకూరి వెంకట సాయి కుటుంబానికి దేవాంగ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో రూ.50వేలు ఆర్థికసహాయం అందజేశారు. స్థానిక బుద్ధి పద్మావతి కల్యాణ మండపంలో ఆదివారం జరిగిన సమావేశంలో సంఘం ఆర్థిక సహాయాన్ని అందచేశారు. ఈ సందర్భంగా దేవాంగ సంక్షేమ సంఘం అధ్యక్షుడు పిచ్చుక మధుసూదనరావు మాట్లాడుతూ చేనేత కార్మికుల సమస్యల పరిష్కారానికి ఐక్యతతో కృషి చేయాలన్నారు. ఈ సమావేశంలో దేవాంగ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి బోనగిరి మల్లికార్జునరావు, నాయకులు బుద్ధి భీమేశ్వరరావు, సజ్జా వెంకటసురేష్, దోనిపర్తి జయరామయ్య, గిద్దలూరు వెంకటనాగేశ్వరరావు, కేవీ సురేష్, ఎస్వీ సురేష్, ఎం నరేంద్ర, జక్కుల మహేష్, పన్నెం రవి, పన్నెం శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

తప్పులను కప్పిపుచ్చుకోవడానికే సోమిరెడ్డిపై విమర్శలు



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

తోటపల్లి గూడూరు, ఫిబ్రవరి 18 : మాజీ మంత్రి సోమిరెడ్డిని విమర్శించే స్థాయి వైసీపీ నాయకులు తలమంచి సురేంద్ర బాబు, ఉప్పల శంకరయ్య గౌడ్‌కు లేదని టీడీపీ మండల అధ్యక్షుడు సన్నారెడ్డి సురేష్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని నరుకూరు తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించారు. అనంతరం సన్నారెడ్డి, ఎంపీటీసీ కొణతం రఘుబాబు మాట్లాడుతూ తప్పులను కప్పిపుచ్చుకోవడానికే సోమిరెడ్డిపై విమర్శలు చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి ముత్యాల శ్రీనివాసులు, టీడీపీ యువత అధ్యక్షుడు గంగపట్నం సుధీర్, మాజీ ఎంపీటీసీ పాక వెంకయ్య, అరికటి వెంకటేశ్వర్లు, రమేష్, మాజీ ఎంపీటీసీ మన్నెం మధు, లేబూరు కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సూర్య నమస్కారాలు

నగరంలోని మూలస్థానేశ్వరాలయంలో ఆదివారం ఉదయం సూర్య నమస్కార నృత్యం, సూర్య నమస్కారాలు జరిగాయి. సురభి గాయత్రి భక్త మండలి ఆధ్వర్యంలో 40 మంది విద్యార్థులు ఈ కార్యక్రమాన్ని కనుల పండువగా నిర్వహించారు. సూర్యుడికి విశేష జరిగాయి.

- నెల్లూరు (సాంస్కృతికం)





నెల్లూరు రూరల్, ఫిబ్రవరి 18 : నెల్లూరు - ముత్తుకూరు రహదారిని సుందరంగా తీర్చిదిద్దేందుకు కార్పొరేషన్ అధికారులు ప్రణాళికలు రూపొందిస్తుండగా కొందరు భవన నిర్మాణ వ్యర్థాలతో ఆ రోడ్డును డంపింగ్ యార్డులా మార్చేస్తున్నారు. భవన వ్యర్థాలను ట్రాక్టర్లలో తరలించి రోడ్డు పక్కన గుట్టలుగా పోస్తున్నారు. దీనిపై అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.

రూరల్ టీడీపీలో కొనసాగుతున్న చేరికలు



టీడీపీలో చేరిన వారితో ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి, గిరిధర్‌రెడ్డి

నెల్లూరు, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : తెలుగుదేశం పార్టీ రూరల్ నియోజకవర్గంలో చేరికలు కొనసాగుతూనే ఉన్నాయి. ఆదివారం 12వ డివిజన్ వావిలేటిపాడుకు చెందిన వైసీపీ ముఖ్య నాయకుడు ఎస్‌డీ అప్సర్ బాషా టీడీపీలో చేరారు. భారీగా తన అనుచరులతో కలిసి పార్టీలోకి రావడంతో వీరందరికి ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి కండువాలు కప్పి స్వాగతం పలికారు. 31వ డివిజన్ అక్కచెరువుపాడు, అంబాపురం ప్రాంతాలకు చెందిన యదనపర్తి శ్రీనివాసులురెడ్డి, దాసరి శ్రీనివాసులు, శనగల శ్రావణ్, చిట్టిబోయిన మస్తానయ్య, నాసిన రమేష్ వారి అనుచరులతో కలిసి టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ ఇంకా అనేక మంది నేతలు వైసీపీ నుంచి టీడీపీలోకి చేరేందుకు సిద్ధమవుతున్నారని చెప్పారు. రాష్ట్ర భవిష్యత్‌ను బాగు చేయడం ఒక్క చంద్రబాబు తోనే సాధ్యమన్నారు. ఈ కార్యక్రమాల్లో నాయకులు మన్నేపల్లి రఘు, బత్తల కృష్ణ, సాబీర్ ఖాన్, కుంచాల విజయభాస్కర్, ఆల్తూరు మస్తానయ్య తదితరులు పాల్గొన్నారు. కాగా, 18వ డివిజన్ హరనాథపురం, పీపుల్స్ పార్క్ ప్రాంతాల్లో ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి సతీమణి సుజితమ్మ, కుమార్తెలు హైందవి, వైష్ణవి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. టీడీపీ మేనిఫెస్టో కరపత్రాలను పంపిణీ చేస్తూ రానున్న ఎన్నికల్లో టీడీపీకి అండగా నిలబడాలని అభ్యర్థించారు. రాష్ట్ర అభివృద్ధి చంద్రబాబుతో, రూరల్ అభివృద్ధి శ్రీధర్‌రెడ్డితోనే సాధ్యమని చెప్పారు.

ఎంపీ వేమిరెడ్డికి రైతుల ధన్యవాదాలు



ఎంపీ వేమిరెడ్డికి ధన్యవాదాలు తెలుపుతున్న రైతులు

నెల్లూరు(హరనాథపురం), ఫిబ్రవరి 18 : భూపరిహారం ఇప్పించాలని కోరిన వెంటనే పరిహారం ఇప్పించిన ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని ఆదివారం ఆయన నివాసంలో కొమ్మరపూడి రైతులు కలిసి ధన్యవాదాలు తెలిపారు. తమ గ్రామంలో జగనన్న కాలనీకి సంబంధించి భూసేకరణ పరిహార బకాయిలు ఇప్పించాలని 62 మంది రైతులం వేమిరెడ్డిని కోరామని, ఆయన విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి రూ.7.70కోట్లు తమ ఖాతాల్లో జమ అయ్యేలా చర్యలు తీసుకున్నారని తెలిపారు.

ఎన్నికల్లో దేవాంగులకే సీట్లు ఇవ్వాలి

నెల్లూరు (సాంస్కృతి కం), ఫిబ్రవరి 18 : రాష్ట్రంలో దేవాంగులు అధి కంగా ఉన్న ప్రాంతాల్లో రాబోవు ఎన్నికల్లో సీట్లు దేవాంగులకే ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ దేవాంగ సంక్షేమ సంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్ సతీష్‌కుమార్, నెల్లూరు జిల్లా దేవాంగ సంక్షేమ సంఘం అధ్యక్షుడు డాక్టరు మన్నెం సతీష్, ప్రధాన కార్యదర్శి పముజుల శంకరయ్య డిమాండ్ చేశారు. రాష్ట్రంలో చీరాల, రాజమండ్రి, రూరల్, పుట్టపర్తి, పెద్దాపురం, పెడన, కోవూరు (నెల్లూరు), హిందూపురం శాసనసభ, లోక్‌సభ స్థానాలు దేవాంగులకు కేటాయించిన పార్టీలకు రాష్ట్రంలో దేవాంగులందరూ మద్దతి స్తారన్నారు. ఇప్పటికే ఆయా నియోజకవర్గాలలో దేవాంగ అభ్యర్థులు పోటీకి ముందుకు వచ్చారని, వారికి పార్టీలు సీట్లు కేటాయించాలని కోరారు.

ఘనంగా పాటూరి పుట్టినరోజు వేడుక

నెల్లూరు (సాంస్కృతికం), ఫిబ్రవరి 18 : నెల్లూరు అభినవ ఘంటసాలగా పిలుచుకునే పాటూరి శ్రీనివాసులు 83వ జన్మదిన వేడుకలు ఆదివారం జరిగాయి. స్వతంత్ర పార్కులో జరిగిన ఈ కార్యక్రమానికి నగర డీఎస్పీ వీరాంజ నేయరెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పాటూరు శ్రీనివాసులు జన్మదిన కేక్ కట్ చేయగా పలువురు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జరిగిన ఘంటసాల పాటల సంగీత విభావరి వీనులవిందు చేసింది.

రాజ్యాధికారానికి ఐక్యతే ఆయుధం

● కాపు, తెలగ, బలిజ ఐక్యవేదిక జాతీయ కన్వీనర్ రాము



బలిజ ఉద్యోగుల ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న రాము

నెల్లూరు (సాంస్కృతికం), ఫిబ్రవరి 18 : విద్యా, వైద్యం, ఆర్థిక, ఉద్యోగ, రాజకీయాలలో అధికారం సాధించాలంటే బలిజలు ఎక్కడ ఉన్నా ఐక్యంగా ఉండాలని కాపు, తెలగ, బలిజ ఐక్యవేదిక జాతీయ కన్వీనర్ దాసరి రాము పిలుపునిచ్చారు. ఆదివారం రాత్రి నగరంలోని రోటరీ ఆడిటోరియంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. బలిజలను చైతన్యపరచడం, అండగా నిలబడడం కోసం 30 ఏళ్లుగా జాతీయ ఐక్యవేదిక కృషి చేస్తోందని చెప్పారు. వివిధ వర్గాలకు చెందిన బలిజలు ప్రతి మండలా నికి 10 వేల నుంచి 12వేల మందికిపైగా ఉన్నారని, వారందరినీ ఒకే తాటి మీదికి తేవడమే లక్ష్యంగా ఐక్యవేదిక పనిచేస్తోందన్నారు. బలిజ ఐక్యవేదిక రాష్ట్ర నాయకుడు రమేష్, నెల్లూరు జిల్లా బలిజ ఐక్యవేదిక కన్వీనర్ అరిగెల సాయి తదితరులు పాల్గొన్నారు.

రేపు మెగా మెడికల్ క్యాంప్

నెల్లూరు (సాంస్కృతికం), ఫిబ్రవరి 18 : రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం కార్యాలయంలో మంగళవారం ఉదయం 10గంటలకు సర్వసభ్య సమావేశంతోపాటు మెగా మెడికల్ క్యాంప్ నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం అధ్యక్షుడు ఎస్ఎం గౌస్, ప్రధాన కార్యదర్శి ఎస్‌పీవీఎస్ మూర్తి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమాలు నగరంలోని భక్తవత్సలనగర్ పెన్షన్ భవనంలో జరుగుతాయని తెలిపారు. ముఖ్య అతిథిగా మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం పాల్గొంటారని తెలిపారు. ఎనెల్ హాస్పిటల్ ఆధ్వర్యంలో జరిగే వైద్య శిబిరంలో అందరికీ వైద్య పరీక్షలు చేసి మందులు ఇస్తారన్నారు.

వివేకానంద వాకర్స్ సంఘం ఏర్పాటు



ప్రమాణ స్వీకారోత్సవంలో వాకర్స్ నాయకులు, సభ్యులు

నెల్లూరు (విద్య), ఫిబ్రవరి 18 : నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో నూతనంగా వివేకానంద వాకర్స్ సంఘాన్ని ఏర్పాటు చేశారు. ఆదివారం వెలమ సంఘం భవన్‌లో నిర్వహించిన ప్రమాణ స్వీకారోత్సవంలో వాకర్స్ ఇంటర్నేషనల్ పాస్ట్ గవర్నర్ ముదిరెడ్డి వెంకటాద్రి రెడ్డి నూతన సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. అసోసియేషన్ అధ్యక్షుడు డీవీ సుబ్బరాజు, ప్రధాన కార్యదర్శి స్వర్ణ రమేష్, కోశాధికారి కే జయదేవ్, ఉపాధ్యక్షులు పీ రవిచంద్ర, ఎం హరిరావు, ఎస్ఎం బాషా, ఎం కొండారెడ్డి, జాలీవాకర్, ఏ ప్రసాద్, సభ్యులు రాజా రమేష్, చంద్రమౌళి, వెంకట్రావు, మల్లికార్జున, నాగేశ్వరరావు, ప్రభాకర్, శ్రీమన్నారాయణ, హుస్సేన్. జావీద్ పాల్గొన్నారు.

ఎడెక్స్ ఒప్పందం రద్దు చేయాలి

● ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి శ్రీహర్ష

నెల్లూరు (విద్య), ఫిబ్రవరి 18 : ఉన్నత విద్యలో ఆన్‌లైన్‌లో కోర్సులు అందించేందుకు ఎడెక్స్ సంస్థతో ప్రభుత్వం చేసుకున్న ఒప్పందాన్ని రద్దు చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎం శ్రీహర్ష ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. అంతర్జాతీయ ప్రమాణాల ముసుగులో ప్రైవేట్ సంస్థల జోక్యం, ఆన్‌లైన్‌లో కోర్సుల విధానం వల్ల ప్రభుత్వ విద్యారంగానికి తీవ్ర నష్టం వాటిల్లుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. జగన్మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తరువాత డిగ్రీలో చేరే విద్యార్థుల సంఖ్య లక్షకు పడిపోయిందని, నాలుగేళ్ల డిగ్రీ కోర్సుల విధానం డ్రాపవుట్లను పెంచుతోందన్నారు. ఈ క్రమంలో కొత్త డిగ్రీ కళాశాలలు స్థాపించి అధ్యాపకుల నియామకాలతో విద్యా ప్రమాణాలను పెంచాల్సి ఉండగా ఆన్‌లైన్ కోర్సుల పేరుతో ఎడెక్స్ సంస్థతో చేసుకున్న ఒప్పందం మరింత ఆందోళన కలిగిస్తోందన్నారు. టెక్నాలజీ ఎప్పటికీ టీచర్‌కు ప్రత్యామ్నాయం కాదని యునెస్కో నివేదిక వెల్లడించిందన్నారు. వందలకోట్లు ఖర్చు చేసి బైజూస్ సంస్థతో చేసుకున్న ఒప్పందం వలన విద్యార్థులకు జరిగిందేమీ లేదని విమర్శించారు. ఈ ఒప్పందాలను రద్దు చేసుకుని, ఆన్‌లైన్ కోర్సుల ఆలోచన విరమించుకోవా లని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ప్రత్యక్ష ఆందోళనకు సిద్ధమవుతామని హెచ్చరించారు.

రేపు భీష్మ ఏకాదశి

నెల్లూరు (సాంస్కృతికం), ఫిబ్రవరి 18 : నగరంలోని తల్పగిరి రంగనాథస్వామి ఆలయంలో మంగళవారం భీష్మ ఏకాదశి వేడుకలు జరుగుతాయని ఈవో డబ్బుగుంట వెంకటేశ్వర్లు తెలిపారు. ఉదయం 8.30గంటలకు శ్రీదేవి, భూదేవి సమేత రంగనాథస్వామికి తిరుమంజనం, సాయంత్రం 6.30గంటలకు గరుడసేవ జరుగుతాయని, భక్తులందరూ తరలిరావాలని కోరారు.

ఉడయవర్లు దేవస్థానంలో 21 నుంచి బ్రహ్మోత్సవాలు

నెల్లూరు (సాంస్కృతికం), ఫిబ్రవరి 18 : నగరంలోని నవాబుపేట ఉడయవర్లు దేవస్థానం లో శ్రీదేవి, భూదేవి సమేత ఆదికేశవ స్వామివారికి ఈనెల 21 నుంచి 26వతేదీ వరకు వార్షిక బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త పల్లాప్రోలు రామకృష్ణమాచార్యులు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ బ్రహ్మోత్సవాలు పాంచరాత్ర ఆగమము, ఏకకుండాత్మకంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 21వతేదీ సాయంత్రం 6గంటలకు అంకురార్పణ, 22వ తేదీ ఉదయం 8.30 గంటలకు ధ్వజారోహణ, సాయంత్రం శేషవాహన సేవ జరుగుతాయన్నారు. 23వతేదీ ఉదయం సూర్యప్రభ వాహన సేవ, రాత్రి హనుమంత వాహన ఉత్సవం, 24వతేదీ ఉదయం మోహినీ అలంకారం, రాత్రి గరుడ సేవ జరుగుతాయన్నారు. 25వతేదీ ఉదయం 8గంటలకు కల్యాణం, మధ్యాహ్నం నగరోత్సవం, రాత్రి అశ్వవాహన సేవ, 26వతేదీ ఉదయం ముసుగుల సేవ, అనంతరం చక్ర స్నానం, సాయంత్రం ధ్వజావరోహణం, అనంతరం ఏకాంతసేవ జరుగుతాయని తెలిపారు. భక్తులు అందరూ తరలిరావాలని కోరారు.

స్టేడియంలో వైద్య శిబిరం

నెల్లూరు (విద్య), ఫిబ్రవరి 18 : నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో ఫ్రెండ్స్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం వైద్య శిబిరం నిర్వహించారు. అసోసియేషన్ అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి మాట్లాడుతూ బిలీవ్ ఆసుపత్రి సౌజన్యంతో వైద్యశిబిరం ఏర్పాటు చేసి కరోనా ముందు, తర్వాత పరిస్థితులపై వాకర్స్‌కు అవగాహన కల్పించామన్నారు. ఆరోగ్య పరిరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశామన్నారు. అనంతరం వైద్య పరీక్షలు నిర్వహించి శుభమస్తు షాపింగ్‌మాల్ సహకారంతో మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ ప్రేమ్‌దీప్, అసోసియేషన్ కార్యదర్శి నసీర్ అహ్మద్, కోశాధికారి సుబ్బరాయుడు, నలుబోలు బలరామయ్యనాయుడు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి

నేడు, రేపు వేలం పాటలు

దుత్తలూరు(ఉదయగిరి రూరల్), ఫిబ్రవరి 18: మండలంలోని నర్రవాడలో ఉన్న శ్రీవెంగమాంబ పేరంటాలమ్మ ఆలయ ఆవరణలో సోమ, మంగళవారాల్లో 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి వివిధ అంశాలపై బహిరంగ వేలంపాటలు నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వాహణాధికారి ఉషశ్రీ ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. పాటలో పాల్గొనేవారు ఆయా అంశాలకు సంబంధించి నిర్ణయించిన నగదును ధరావత్తు కింద చెల్లించాలన్నారు. పాట దక్కించుకున్న వారు 1.4.2024 నుంచి 31.3.2025 వరకు హక్కు కలిగి ఉంటారన్నారు. మరిన్ని వివరాలకు కార్యాలయంలో సంప్రదించాలని ఆమె కోరారు.

సిద్ధం అరాచకానికా?


గాయపడిన ఫొటోగ్రాఫర్ కృష్ణ

'సిద్ధం' అంటూ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి సభలు పెట్టేది మీడియాపై అరాచకం చేసేందుకా?.. అని నాయకులు, ప్రజాస్వామ్యవాదులు, జర్నలిస్టు సంఘాల నేతలు ప్రశ్నిస్తున్నారు. అనంతపురం జిల్లా రాప్తాడులో ఆదివారం జరిగిన వైసీపీ 'సిద్ధం' సభ కవరేజీ కోసం వెళ్లిన 'ఆంధ్రజ్యోతి' ఫొటోగ్రాఫర్ కృష్ణపై వైసీపీ మూకల విచక్షణరహిత దాడిని ఖండించారు. సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయిన దాడి దృశ్యాలను చూసిన వీరంతా దిగ్భ్రమ చెందారు. ఇలాంటి అమానుష చర్యలను ప్రతి ఒక్కరూ ఖండించాలని పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్యబద్ధంగా రాజకీయాలు చేయాలేగానీ ఇలా దాడులకు దిగడం సరికాదని హితవు పలికారు. ఈ దాడులకు నిరసనగా సోమవారం జిల్లా అంతటా నిరసనలు, ధర్నాలు చేపట్టనున్నట్లు తెలిపారు.


తిరుపతిలో నిరసన తెలుపుతున్న టీడీపీ నాయకులు

● రాప్తాడులో 'ఆంధ్రజ్యోతి' ఫొటోగ్రాఫర్‌పై దాడిని ఖండించిన పార్టీలు, ప్రజాస్వామ్యవాదులు

తిరుపతిలో టీడీపీ శ్రేణుల నిరసన

తిరుపతి, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): అనంతపురం జిల్లా రాప్తాడులో ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్‌పై జరిగిన దాడిని ఖండిస్తూ టీడీపీ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి స్థానిక భవానీ నగర్ సర్కిల్లో పార్టీ శ్రేణులు పెద్దఎత్తున నిరసన తెలిపాయి. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. మీడియాపై దాడిచేయడం హేయమైన చర్య అన్నారు. వీధి రౌడీల్లా దాడులకు దిగిన వైసీపీ మూకలను వెంటనే అరెస్టు చేయాలని డిమాండు చేశారు. ప్రజా సమస్యలపై ప్రభుత్వాలను ప్రశ్నించే మీడియా గొంతు నొక్కడం సరికాదన్నారు. దాడుల సంస్కృతిని మానుకోవాలని, మరో రెండు నెలల్లో వైసీపీ రౌడీలకు తగిన గుణపాఠం చెబుతామన్నారు. ఈకార్యక్రమంలో టీడీపీ కార్పొరేటర్ ఆర్సీ మునికృష్ణ, నగర ప్రధాన కార్యదర్శి మహేష్ యాదవ్, పార్లమెంటు అధికార ప్రతినిధి ఊట్ల సురేంద్ర నాయుడు, నాయకులు ఆర్సీ శ్రీనివాస్, సుబ్బు యాదవ్, శ్రీరాములు, జగ్గా, శంకర్ యాదవ్, ధనంజయ, సుజాత, తోట వాసు, జిమ్ ప్రకాష్, శరత్, హేమంత్, శ్రీకాంత్, వెంకటరెడ్డి, సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ నాయకులా? వీధి రౌడీలా?



వైసీపీ నాయకులా? వీధి రౌడీలా? అర్థం కావడం లేదు. ఇలాంటి దాడులను తీవ్రంగా ఖండిస్తున్నాం. దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని రాష్ట్రపతి, గవర్నర్‌కు లేఖ రాయనున్నాం. సీఎం ప్రసంగిస్తుండగా.. పోలీసులు చూస్తుండగా ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్‌పై పైశాచికంగా దాడిచేయడం దారుణం. జగన్ ప్రభుత్వంలో రాష్ట్రవ్యాప్తంగా మీడియాపై జరిగిన దాడులపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి.

- నరసింహ యాదవ్, తిరుపతి పార్లమెంటు టీడీపీ అధ్యక్షుడు

వైసీపీకి రోజులు దగ్గర పడ్డాయి



పత్రికా స్వేచ్ఛను హరిస్తూ దౌర్జన్యాలతో బెదిరించే ప్రయత్నం చేస్తున్న వైసీపీకి రోజులు దగ్గర పడ్డాయి. ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్‌పై దాడి చేసినవారిపై హత్యాయత్నం కేసులు నమోదు చేయాలి. సీఎం ప్రసంగిస్తున్న సమయంలోనే జరిగిన దాడిని బీజేపీ తీవ్రంగా ఖండిస్తోంది. ఏపీని అరాచక ప్రదేశ్‌గా మార్చిన జగన్ రెడ్డిపై విచారణ జరిపించాలి.

- సామంచి శ్రీనివాస్, బీజేపీ అధికార ప్రతినిధి

తిరుపతిలో నేడు ఏపీయూడబ్ల్యూజే నిరసన

ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్‌పై వైసీపీ మూకల దాడిని ఖండిస్తూ సోమవారం ఉదయం 10.30గంటలకు తిరుపతిలోని గాంధీ విగ్రహం ఎదుట నిరసన తెలుపుతున్నట్టు ఏపీయూడబ్ల్యూజే అధ్యక్ష, కార్యదర్శులు ప్రసాద్, నరేంద్రలు ఆదివారం ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. విధులు నిర్వహిస్తున్న ఫొటోగ్రాఫర్‌పై దాడిచేయడం హేయమైన చర్యగా పేర్కొన్నారు. శాంతియుతంగా నిర్వహించనున్న నిరసనకు జర్నలిస్టు సంఘాలు, ప్రజా సంఘాలు పాల్గొనాలని కోరారు. అలాగే ఏపీ జర్నలిస్టు ఫోరం ఉమ్మడి చిత్తూరు జిల్లా నేత హరిబాబు కూడా ఈ దాడిని తీవ్రంగా ఖండించారు.

ఇలాంటి ఉన్మాద చర్యలకు భయపడం

ఫొటో జర్నలిస్టు అసోసియేషన్

సీఎం సిద్ధం సభలో ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్‌పై జరిగిన ఉన్మాద చర్యలకు ఫొటోగ్రాఫర్లు భయపడే ప్రసక్తే లేదని ఫొటో జర్నలిస్టు అసోసియేషన్ పేర్కొంది. ఈ మేరకు ఆ అసోసియేషన్ నాయకులు కాళహస్తి గిరిబాబు, రాధాకృష్ణ, లావణ్యకుమార్ ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు.

పత్రికా స్వేచ్ఛను హరిస్తున్నారు



ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్‌పై వైసీపీ నాయకుల దాడిని జనసేన తీవ్రంగా ఖండిస్తోంది. రాష్ట్రంలో పత్రికా స్వేచ్ఛను హరిస్తున్నారు. పైగా బెదిరించే ప్రయత్నం చేస్తున్న వైసీపీకి రోజులు సమీపించాయి. ఇలాంటి దాడులపై ప్రతీకారం తప్పక ఉంటుంది. రాష్ట్రాన్ని అరాచక ప్రదేశ్‌గా మార్చిన జగన్ రెడ్డిపై విచారణ జరిపించాలి.

- కిరణ్ రాయల్, తిరుపతి జనసేన ఇన్‌చార్జి

భౌతికదాడులను అందరూ ఖండించాలి



వృత్తి ధర్మాన్ని నిర్వహిస్తున్న వ్యక్తిపై భౌతికదాడులా? వైసీపీ నాయకులు వాళ్ల వైఖరి మార్చుకోవాలి. చంద్రగిరి నియోజకవర్గంలో కూడా పలుసార్లు విలేకరులపై దాడులు జరిగాయి. ఇటువంటి దాడులను పార్టీలకతీతంగా ప్రతి ఒక్కరూ ఖండించాలి. ఎన్నడూ లేనివిధంగా రాష్ట్రంలో రాక్షస పాలన కొనసాగుతోంది. నిజాలు నిర్భయంగా చెప్పాలన్నా, రాయాలన్నా విలేకరులకు స్వేచ్ఛ ఉండాలి.

- పులివర్తి నాని, టీడీపీ చంద్రగిరి ఇన్‌చార్జి

దాడి అమానుషం



ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్‌పై వైసీపీ మూకలు దాడిచేయడం అమానుషం. దాడి దృశ్యాలు చూస్తుంటే మనం ప్రజాస్వామ్యంలోనే ఉన్నామా అన్న అనుమానం కలుగుతోంది. ఇలాంటి చర్యలను ప్రతి ఒక్కరూ ఖండించాలి. ఈ ఘటన వైసీపీ రాక్షస పాలనకు అద్దం పడుతోంది. నిందితులపై పోలీసులు హత్యాయత్నం కేసులు నమోదు చేయాలి.

- కురుగొండ్ల రామకృష్ణ, మాజీ ఎమ్మెల్యే

దాడి దారుణం



సీఎం జగన్ సిద్ధం సభలో ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్‌పై వైసీపీ మూకలు దాడి చేయడం దారుణం. వైసీపీ ప్రభుత్వంలో దాడులు, దౌర్జన్యాలు పెరిగిపోతున్నాయి. పత్రికా స్వేచ్ఛను హరించేలా వైసీపీ కార్యకర్తలు గూండాల్లా ప్రవర్తిస్తున్నారు. ఈ చర్యలను తీవ్రంగా ఖండిస్తున్నాం. దాడికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి.

- పాశిం సునీల్ కుమార్, మాజీ ఎమ్మెల్యే

ప్రజాస్వామ్యమా.. ఆటవిక రాజ్యమా?



ఫొటోగ్రాఫర్‌పై అమానుషంగా దాడిచేయడం పత్రికా స్వేచ్ఛను హరించడమే. ఇలాంటివి ఏ రాజకీయ పార్టీకి మంచిది కాదు. ఇలాంటివి పునరావృతం కాకుండా చూసుకోవాల్సిన బాధ్యత ఆయా పార్టీ నాయకులపై ఉంది. ఈవిధానం మంచిది కాదు. సహనం నశించిపోతే ప్రజలు తిరగబడే రోజు దగ్గరలో ఉంది. ప్రకృతి చాలా గొప్పది. బలవంతుడు బలహీనుడిని కొడితే, బలవంతుడిని భగవంతుడు కొడతాడు. ఇది సత్యం.

- నవీన్‌కుమార్ రెడ్డి, రాయలసీమ పోరాట సమితి కన్వీనర్

ప్రజాస్వామ్యం ఖూనీ



రాష్ట్రంలో ప్రజాస్వామ్యం ఖూనీ అయింది. ఇంత దారుణ పరిస్థితులు రాష్ట్రంలో ఎన్నడూ చూడలేదు. వృత్తి ధర్మంలో భాగంగా విధి నిర్వహణలో ఉన్న ఫొటోగ్రాఫర్‌పై వైసీపీ శ్రేణులు ఇంత క్రూరంగా ప్రవర్తించడం బాధాకరం.

- బొజ్జల సుధీర్ రెడ్డి, టీడీపీ శ్రీకాళహస్తి ఇన్‌చార్జి

దాడులు మంచి పద్ధతి కాదు



ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్‌పై అధికార పార్టీ కార్యకర్తలు పాశవికంగా భౌతిక దాడులు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం. పత్రికారంగాన్ని అధికారంలో ఉన్నవారు గౌరవించే సంప్రదాయాన్ని పాటించకుండా దాడులు చేయడం మంచి పద్ధతి కాదు. ఫొటోగ్రాఫర్ వృత్తిధర్మాన్ని పాటించారే కానీ, వ్యక్తిగత కక్షలకు రాలేదన్న స్పృహ ఉండాలి. ఇలాంటివి పునరావృతం కాకుండా అధికార పార్టీ నాయకులు సంయమనం పాటించాలి.

- రాకేష్‌రెడ్డి, పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్

తుమ్మలగుంట చెరువులో అనధికారిక నిర్మాణాలపై కొరడా?


తుమ్మలగుంట చెరువులో జరిగిన నిర్మాణాలు

● తొలగించాల్సిందేనన్న ఎన్జీటీ

తిరుపతి, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ మండలం తుమ్మలగుంట చెరువులో అనధికారిక నిర్మాణాలపై నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ (ఎన్జీటీ) కొరడా ఝుళిపించింది. చెరువు స్వరూపాన్ని మార్చిన వారిపై చర్యలు తీసుకొని, నిర్మాణాలను తొలగించాలని సూచించినట్టు తెలుస్తోంది. దీనిపై ఏప్రిల్ 23వ తేదీలోపు నివేదిక ఇవ్వాలని కాలుష్య నియంత్రణ మండలితోపాటు కలెక్టరును ఆదేశించినట్టు సమాచారం. దీంతో తుడా అధికారులు నివేదిక సమర్పించడానికి తర్జనభర్జన పడుతున్నట్టు తెలుస్తోంది. గత ఏడాది సెప్టెంబరులో తుమ్మలగుంట చెరువులో ఏమి జరుగుతుందో వివరణ ఇవ్వాలని కలెక్టర్, తుడా, నీటిపారుదల శాఖను ఎన్జీటీ ఆదేశించింది. తుమ్మలగుంట చెరువు అన్యాక్రాంతమవుతోందని పలువురు స్థానికులు చేసిన ఫిర్యాదు మేరకు ఎన్జీటీ గతంలోనే సీరియస్ అయ్యింది. చెరువు స్టేటస్‌పై నివేదిక పంపాలని ఆదేశించింది. గత ఏడాది అక్టోబరులో తుడా నివేదికలు పంపినట్టు సమాచారం. అయితే వాటికి ఎన్జీటీ సంతృప్తి చెందనట్టు తెలుస్తోంది.

పూర్వాపరాలిలా..

తిరుపతి రూరల్ మండలం సర్వేనెంబరు 60లో 82 ఎకరాల విస్తీర్ణంలో తుమ్మలగుంట చెరువు ఉంది. దీనికి ఎగుదాల ఉండే పేరూరు చెరువు, స్వర్ణముఖి నుంచి కాలువలు ద్వారా తుమ్మలగుంట చెరువుకు నీళ్లు వచ్చేవి. ఈ నీటితో తుమ్మలగుంట 180 ఎకరాల ఆయకట్టుతో పొలాలు పచ్చగా, గ్రామం పుష్కలంగా ఉండేది. భూగర్భ జలాలు బాగా అందుబాటులో ఉండేవి. ఇదంతా గతం. క్రమేపీ ఈ చెరువుకు నీళ్లు తెచ్చే కాలువలు అంతర్ధానమయ్యాయి. చెరువు ఎండిపోయింది. తుమ్మలగుంట చెరువుకు రెండు నీటి సరఫరా కాలువలు ఉండేవి. స్వర్ణముఖి నుంచి పాత కాల్వ మీదుగా ఒకటి, పేరూరు చెరువు నుంచి అక్కగార్ల కళం కాలువ నుంచి మరో కాలువ తుమ్మలగుంటకు అనుసంధానమై ఉండేవి. చెరువులోకి నీళ్లొచ్చాయంటే రెండు కార్లు గట్టిగా పండించుకోవచ్చన్న ధీమా ఇక్కడ రైతులకుండేది. కాలక్రమంలో ఈ రెండు కాలువలు కబ్జాచేసి.. ఇళ్లు కట్టేశారు. దీంతో చెరువుకు నీరు చేరే అవకాశం లేకుండా పోయింది. ఆ చెరువు ఇప్పుడు కుర్రకారుకు సువిశాల ఆటస్థలంగా మారిపోయింది. 82 ఎకరాల చెరువులో 22 ఎకరాలను మునకపట్టాల కింద రైతులకు రెవెన్యూ అధికారులు అందించారు. తక్కిన 60 ఎకరాల్లో తుమ్మలగుంట స్థానికుడైన చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కరరెడ్డి గతంలో తుడా చైర్మన్‌గా ఉన్నప్పుడు చెరువును సుందరీకరణ చేయాలని భావించారు. ఈక్రమంలో చెరువు చుట్టూ వాకింగ్ ట్రాక్ వేశారు. బోటింగ్ ఏర్పాటు చేయాలని చెరువును కొంత భాగం తవ్వారు. అంతేగాక జిల్లా క్రికెట్ అసోసియేషన్‌కు కొంత కేటాయించారు. నెట్ ప్రాక్టీసింగ్‌కు వినియోగిస్తున్నారు. ఏడాదికి ఒకసారి ఇక్కడ గ్రామీణ క్రికెట్ పోటీలు పెడుతుంటారు. ఈ నేపథ్యంలో చెరువు తన స్వరూపాన్ని కోల్పోయిందంటూ ఎన్జీటీకి ఫిర్యాదులు అందాయి. ఈక్రమంలో ఎన్జీటీ ఆగ్రహంపై ఎలాంటి నిర్ణయం తీసుకోనున్నారో వేచిచూడాలి.

గున్న ఏనుగు మృతి

చంద్రగిరి, ఫిబ్రవరి 18: చంద్రగిరి మండలం కూచువారిపల్లె అటవీప్రాంతంలోని నాగపట్ల వెస్ట్ బీట్ పరిధిలో ఓ గున్న ఏనుగు (ఏనుగు పిల్ల) మృతి చెందింది. నెల రోజులుగా చంద్రగిరి మండలంలోని మూలపల్లె, భీమవరం, చిన్న రామాపురం, శేషాపురం, బీ.కొంగరవారిపల్లె, యల్లంపల్లి ప్రాంతాల్లో ఏనుగులు అర్ధరాత్రయితే పంట పొలాలను ధ్వంసం చేస్తున్నాయి. ఇటీవల యల్లంపల్లికి చెందిన రైతు మనోహర్‌రెడ్డి తన పొలం వద్ద నిద్రిస్తుండగా ఏనుగు దాడి చేసిన విషయం తెలిసిందే. ఆదివారం ఉదయం అటవీ సిబ్బంది పెట్రోలింగ్ చేస్తుండగా కూచువారిపల్లె అటవీ ప్రాంతంలో గున్న ఏనుగు మృతి చెందినట్లు గుర్తించారు. సమాచారం అందుకున్న అటవీ ఉన్నతాధికారులు సీసీఎఫ్ నాగేశ్వరరావు, డీఎఫ్‌వో సతీష్, శివకుమార్, ఎఫ్ఆర్వో దత్తాత్రేయ, డీఆర్వో చక్రపాణి సంఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతి చెందిన గున్న ఏనుగును పరిశీలించారు.


గున్న ఏనుగు కళేబరాన్ని పరిశీలిస్తున్న అటవీ అధికారులు

సుమారు ఏడాది వయసున్న ఈ ఏనుగు పిల్ల మృతి చెంది 20 రోజులకుపైగా అవుతున్నట్లు భావిస్తున్నారు. కళేబరం కూడా పురుగులు పట్టి, దుర్గంధం వెదజల్లుతోందని తెలిపారు. అనంతరం ఎస్వీ జూపార్కు నుంచి వైద్యులను పిలిపించి పోస్టుమార్టం నిర్వహించారు. నివేదిక వచ్చాక ఎలా చనిపోయిందో తెలుస్తుందని అధికారులు పేర్కొన్నారు.

పద్మావతి మహిళా యూనివర్సిటీకి రూ.100 కోట్ల రూసా నిధులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఫిబ్రవరి 18: తిరుపతిలోని పద్మావతి మహిళా యూనివర్సిటీకి పీఎం ఉష (రూసా) నిధులు రూ.100 కోట్లు మంజూరయ్యాయి. దీనిపై వర్సిటీ వీసీ భారతి, రిజిస్ట్రార్ రజని హర్షం వ్యక్తం చేశారు. 40 ఏళ్ల సుదీర్ఘ చరిత్ర ఉన్న వర్సిటీ.. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిందని తెలిపారు. ఇప్పటికే అనేక గొప్ప ర్యాంకులను సాధించిందని గుర్తు చేశారు. యూజీసీ నాక్ ఏప్లస్ పొందడం వల్లే రూసా నిధులకు ఎంపికైనట్టు పేర్కొన్నారు. ఈ నిధులతో వర్సిటీలో బోధన, పరిశోధనకు సంబంధించిన సదుపాయాలను మెరుగు పరుస్తామన్నారు.

ఆస్ట్రేలియా అమ్మాయి.. తిరుపతి అబ్బాయి

మూడుముళ్ల బంధంతో ఒక్కటయ్యారు



తిరుపతి(విద్య), ఫిబ్రవరి 18: ఆస్ట్రేలియాలోని మెల్‌బోర్న్‌కి చెందిన బ్రైడి మార్టిన్.. తిరుపతికి చెందిన జీపాళ్యం నాగేంద్ర సాయిలు ఆదివారం రాత్రి మూడుముళ్ల బంధంతో ఒక్కటయ్యారు. ఎస్వీ వెటర్నరీ వర్సిటీలోని డెయిరీ టెక్నాలజీ విభాగం డీన్ డాక్టర్ జీపాళ్యం సురేష్, శారద దంపతుల కుమారుడు నాగేంద్రసాయి తన మాస్టర్‌డిగ్రీని మెల్‌బోర్న్‌లోని డీకిన్ యూనివర్సిటీలో పూర్తిచేశారు. చదువు పూర్తయ్యాక ఉద్యోగంలో చేరిన సంస్థలో మెల్‌బోర్న్‌కి చెందిన జోఅన్నె మార్టిన్, డారెన్ మార్టిన్‌లకుమార్తె బ్రైడితో ఏర్పడిన పరిచయం ప్రేమగా మారింది. మూడేళ్లపాటు ప్రేమలో ఉన్న వీరు.. ఇరుకుటుంబాల అంగీకారంతో ఆదివారం రాత్రి తిరుపతిలోని హోటల్‌తాజ్‌లో పెళ్లి చేసుకున్నారు. ఈ నవదంపతులను వెటర్నరీవర్సిటీకి చెందిన పలువురు ప్రొఫెసర్లు, అధ్యాపకులు, సిబ్బంది ఆశీర్వదించారు.

పరీక్షల్లో ఫెయిలవడం.. అమ్మ మందలింపు


శశి (ఫైల్ ఫొటో)

● మనస్తాపంతో వ్యవసాయ పాలిటెక్నిక్ విద్యార్థిని ఆత్మహత్య

తిరుపతి (నేరవిభాగం), ఫిబ్రవరి 18: పరీక్షల్లో ఫెయిలవడంతో అమ్మ మందలించిందని.. మనస్తాపంతో వ్యవసాయ పాలిటెక్నిక్ విద్యార్థిని ఒకరు ఆత్మహత్య చేసుకున్నారు. తిరుపతి రూరల్ ఎస్ఐ నాగేంద్రబాబు తెలిపిన ప్రకారం.. చిత్తూరు జిల్లా వెదురుకుప్పం మండలం తిరుమలయ్యపల్లె పంచాయతీ వేణుగోపాలపురానికి చెందిన టి.గోవిందరాజులు, మమత దంపతుల రెండో కుమార్తె టి.శశి(16). ఈమె తిరుపతి ఎస్వీ అగ్రికల్చరల్ కళాశాల హాస్టల్లో ఉంటూ, పాలిటెక్నిక్ మొదటి సంవత్సరం చదువుతోంది. ఇటీవల మొదటి సెమిస్టర్ పరీక్షలు రాసి సెలవుల్లో ఇంటికి వెళ్లింది. వారం కిందట వచ్చిన ఫలితాల్లో ఆమె ఫెయిలవడంతో తల్లి మందలించింది. మూడ్రోజుల కిందట హాస్టల్‌కు వచ్చిన ఆమె.. శనివారం రాత్రి ఇంటికి ఫోన్‌చేసి చాలాసేపు మాట్లాడింది. రాత్రి 12 గంటల వరకు చదువుకుని, సహ విద్యార్థినులతో కలిసి నిద్రకు ఉపక్రమించింది. ఆదివారం సెలవు కావడంతో అందరూ ఉదయం ఎనిమిది గంటలకు నిద్రలేచారు. అప్పటికే సీలింగ్ ఫ్యాన్‌కు చీరతో ఉరేసుకున్న శశి కనిపించింది. సమాచారం అందుకున్న రూరల్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎస్వీ మెడికల్ కళాశాలకు తరలించారు. తల్లి ఫిర్యాదుమేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు. 'ఇప్పటి వరకు తెలుగు మీడియంలో చదివాను.ఒక్కసారిగా ఇంగ్లి‌ష్‌లో చదవాల్సి రావడం కష్టంగా ఉంది. అర్థం చేసుకోలేకపోతున్నాను. అందుకే పరీక్షల్లో కూడా ఫెయిల్ అయ్యాను. అమ్మ ఎప్పుడూ తిడుతూనే ఉంటారు. నావల్లనే కదా మీ అందరికీ అవమానం. నేనే వెళ్లిపోతా. మీరు సంతోషంగా ఉండండి' అంటూ ఆమె రాసిన సూసైడ్ నోట్ పోలీసులకు లభించింది.

అత్త చీరతో..: ఉరేసుకోవడానికి వాడిన చీర శశి అత్తదని పోలీసులు గుర్తించారు. ఊరినుంచి వచ్చేటప్పుడే ఈ చీరను తెచ్చుకున్నట్లు భావిస్తున్నారు. కాగా, కొన్నేళ్ల కిందట ఇద్దరు కుమార్తెలతో పుట్టింటికి చేరిన మమత.. ఇద్దరు పిల్లలను చదివిస్తున్నారు. రెండో కుమార్తె శశి ఆత్మహత్య చేసుకోవడంతో ఆమెతో పాటు బంధువులు రోదిస్తున్నారు.

గూడూరు
సూళ్లూరుపేట/వెంకటగిరి

గేటు పడితే అర్ధగంట ఆగాల్సిందే!

- బారులు తీరుతున్న వాహనాలు
- విద్యార్థులు, ఉద్యోగుల అవస్థలు
- ఆర్వోబీ, లేదా ఆర్‌యూబీ నిర్మించాలని విజ్ఞప్తి



రైల్వేగేటు మూసివేయడంతో ఆగివున్న వాహనాలు

వెంకటగిరి టౌన్, ఫిబ్రవరి 18: వెంకటగిరి - నాయుడుపేట రహదారి నిత్యం రద్దీగా ఉంటుంది. మేనకూరు, శ్రీసిటీ సెజ్‌లతో పాటు చెన్నై వెళ్లే వాహనాలు ఈ మార్గంలో రాకపోకలు సాగిస్తుంటాయి. ఈ దారిలోనే కృషి విజ్ఞాన కేంద్ర, నిమ్మ, చీని పరిశోధన శాస్త్రం, ఏపీ మోడల్ స్కూల్ వంటివి ఉన్నాయి. దీంతో ఉద్యోగులతో పాటు విద్యార్థులు పెద్దసంఖ్యలో వచ్చిపోతుంటారు. ఈ రహదారిపై రైల్వే గేటు ఉంది. ప్రతిరోజూ దాదాపు నలభై నుంచి యాభై రైళ్లు రాకపోకలు సాగిస్తుండడంతో తరచూ గేటు మూసివేస్తుంటారు. ఒక్కసారి గేటు పడితే కనీసం పావు గంట సేపు వాహనాలు ఆగిపోతున్నాయి. కొన్నిసార్లు ఒక రైలు వెళ్లాక, ఇంకో రైలు వచ్చేదాకా గేటు తీయడం లేదు. దీంతో సుమారు అర్ధగంట వరకు వాహనాలు బారులుతీరుతున్నాయి. దీంతో పరిశ్రమలకు, కార్యాలయాలకు వెళ్లే ఉద్యోగులతో పాటు పాఠశాల విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ రైల్వే గేటు వద్ద ఫ్లైఓవర్, లేదా అండర్ బ్రిడ్జి నిర్మించాలని స్థానికులు పలుమార్లు విజ్ఞప్తి చేసినా రైల్వే శాఖ అధికారులు పట్టించుకోలేదు. ప్రజాప్రతినిధులు, అధికారులు చొరవతీసుకుని వెంకటగిరి ఈ రైల్వే గేటు వద్ద ఆర్వోబీ, లేదా ఆర్‌యూబీ నిర్మించి సమస్య పరిష్కరించాల్సిన అవసరం ఉంది.

అరాచక ప్రభుత్వాన్ని గద్దె దించాలి



పార్టీలో చేరిన వారితో మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్

గూడూరు, ఫిబ్రవరి 18: రాష్ట్రంలో అరాచ కపాలన సాగిస్తున్న వైసీపీ ప్రభుత్వాన్ని రానున్న ఎన్నికల్లో గద్దెదించాలని మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ అన్నారు. ఆదివారం చిల్లకూరు మండలం బూదనం గ్రామానికి చెందిన పలువురు టీడీపీలోకి చేరడంతో వారికి పార్టీ కండువాలను కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలతో అన్ని వర్గాల ప్రజలు అవస్థలు పడుతున్నారన్నారు. ప్రభుత్వం అభివృద్ధిని మరచి, దోచుకోవడమే పనిగా పెట్టుకుందన్నారు. వైసీపీ అరాచకాలను తట్టుకోలేక పలువురు టీడీపీలో చేరుతున్నారన్నారు. అందరం కలిసికట్టుగా పనిచేసి రానున్న ఎన్నికల్లో టీడీపీని గెలిపించుకోవాలన్నారు. కార్యక్రమంలో శీలం కిరణ్‌కుమార్, నెలబల్లి భాస్కర్‌రెడ్డి, అబ్దుల్‌రహీం, బిల్లు చెంచురామయ్య, వెంకటేశ్వర్లురెడ్డి, గుండాల లీలావతి, మణిశేఖర్‌గౌడ్, శ్రీనివాసులురెడ్డి, దశరథరామిరెడ్డి, ఏడుకొండలు, అంకయ్య తదితరులు పాల్గొన్నారు.

అక్రమ కట్టడంపై చర్యలు తీసుకోండి



కాలువస్థలంలో నిర్మిస్తున్న కట్టడం

గూడూరు, ఫిబ్రవరి 18: స్థానిక సంయుక్తానగర్ సమీపంలో పంటకాలువకు సంబంధించిన స్థలాన్ని ఆక్రమించుకుని కొందరు నిర్మాణాలు చపట్టారని, అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. ఆదివారం వారు మాట్లాడుతూ కొందరు నీటిపారుదలశాఖకు చెందిన విలువైన స్థలాన్ని ఆక్రమించి పక్కా నిర్మాణాలు చేపడుతున్నారని, ఇప్పటికే ఈ విషయమై రెవెన్యూ అధికారులతో ఫిర్యాదు చేశామన్నారు. ఇరిగేషన్ ఏఈ సురేష్‌ను వివరణ కోరగా కొందరు పంటకాలువ స్థలాన్ని ఆక్రమించుకుని నిర్మాణాలు చేపడుతున్నట్లు తమ దృష్టికి తీసుకురావడంతో ఆదివారం ఆ స్థలాన్ని పరిశీలించామని చెప్పారు. సర్వే నిర్వహించి పంటకాలువ స్థలం ఆక్రమణపై చర్యలు చేపడుతామని ఏఈ చెప్పారు.

వైసీపీ విస్తృత స్థాయి సమావేశం

వెంకటగిరిటౌన్, ఫిబ్రవరి 18: స్థానిక ఎన్‌జేఆర్ భవన్‌లో వైసీపీ జిల్లా అధ్యక్షుడు, వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రాంకుమార్ రెడ్డి ఆధ్వర్యంలో మండల స్థాయి నాయకులు, కార్యకర్తలతో ఆదివారం విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన తండ్రి నేదురుమల్లి జనార్దన రెడ్డి, తల్లి రాజ్యలక్ష్మి వెంకటగిరిని ఆదర్శంగా తీర్చి దిద్దారని, వారి బాటలోనే తాను కూడా పయనిస్తానని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో వైసీపీ విజయానికి అందరూ కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎస్వీబీసీ చైర్మన్ సాయికృష్ణ యాచేంద్ర, వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కంటి వైద్య శిబిరం



రోగులకు పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

నాయుడుపేట టౌన్, ఫిబ్రవరి 18: పట్టణంలోని రాజగోపాల పురం ప్రాథమిక పాఠశాల ఆవరణలో చాగణం లలితమ్మ, భాస్కర్‌రావు మెమోరియల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. తిరుపతిలోని వెంకటేశ్వర అరవింద్ నేత్రాలయ ఆధ్వర్యంలో రోగులకు కంటి పరీక్షలు చేశారు. 51మందికి ఉచితంగా కంటి అద్దాలు అందజేశారు. 54మందిని ఆపరేషన్‌కు ఎంపిక చేశారు. కార్యక్రమంలో మెమోరియల్ ట్రస్టు మేనేజింగ్ డైరెక్టర్ చాగణం గౌరీశంకర్, సీఈవో సీతారామనాయుడు, ట్రస్టు ఏవో కృష్ణ అరవింద్, సిబ్బంది అనిత, భవానీ, చరణ్ తదితరులు పాల్గొన్నారు.

యాత్రికులు, లాడ్జి సిబ్బందికి ఘర్షణ
ఒకరికి గాయాలు - ఫర్నిచర్ ధ్వంసం

తిరుపతి(నేరవిభాగం), ఫిబ్రవరి 18 : శ్రీవారి దర్శనార్థం తిరుపతికి వచ్చిన యాత్రికులకు, వారు బసచేసిన లాడ్జి సిబ్బందికి ఘర్షణ చోటుచేసుకుంది. యాత్రిక బృందంలో ఒకరికి గాయాలు కావడంతో లాడ్జిలోని అద్దాలు, టీవీ, ప్రింటర్ తదితరాలను ధ్వంసం చేశారు. ఈస్ట్ సీఐ మహేశ్వర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... బెంగళూరుకు చెందిన 8 మంది యాత్రికుల బృందం పెద్దకాపు లేఅవుట్‌లోని శ్రీనివాసగ్రాండ్ లాడ్జిలో రెండు గదులను అద్దెకు తీసుకున్నారు. శనివారం ఉదయం 5 గంటల సమయంలో గదులను తీసుకుని, ఆదివారం ఉదయం 5 గంటలకు ఖాళీ చేయాల్సి ఉంది. అయితే స్నానం చేసేందుకు నీళ్లు లేకపోవడంతో గంట సమయం ఆలస్యంగా ఖాళీ చేశారు. ఆలస్యమైనందుకు కాస్త ఎక్కువ చెల్లించాలని లాడ్జి సిబ్బంది డిమాండ్ చేశారు. నీళ్లు ఇవ్వాల్సిన బాధ్యత లాడ్జివారిదేనని, నీళ్లు లేనందునే ఆలస్యమైందని భక్త బృందం వాదించింది. ఈ క్రమంలో లాడ్జి సిబ్బంది ఒకరు దాడి చేయడంతో భక్త బృందంలో వివేక్ అనే యువకుడికి గాయాలయ్యాయి. దీంతో భక్తులు లాడ్జిలోని ఫర్నిచర్‌ను ధ్వంసం చేశారు. ఈస్ట్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇరువర్గాలపై కేసులు నమోదు చేస్తామని సీఐ వెల్లడించారు.

నేడు గూడూరులో స్పందన

గూడూరు, ఫిబ్రవరి 18: గూడూరులోని సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సోమవారం కలెక్టర్ లక్ష్మీశ ఆధ్వర్యంలో స్పందన కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆర్డీవో కిరణ్‌కుమార్ తెలిపారు. డివిజన్ పరిధిలోని ప్రజలు సద్వినియోగం చేసుకుని తమ సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించుకోవాలని సూచించారు.

20న రక్తదాన శిబిరం

కోట, ఫిబ్రవరి 18: మండల పరిధిలోని విద్యానగర్‌లో గల నేదురుమల్లి సుబ్బరామిరెడ్డి కళాభవన్‌లో ఈనెల 20వ తేదీన రక్తదాన శిబిరం జరుగుతుందని స్థానిక ఇంజనీరింగ్ కళాశాల డైరెక్టర్ డాక్టర్ విజయకుమార్‌రెడ్డి ఆదివారం తెలిపారు. మాజీ సీఎం నేదురుమల్లి జనార్దనరెడ్డి జయంతిని పురస్కరించుకొని రక్తదాన శిబిరాన్ని నిర్వహిస్తున్నామన్నారు. నెల్లూరు రెడ్‌క్రాస్ సొసైటీ బ్లడ్ బ్యాంక్, డీఎస్ఆర్ ప్రభుత్వాస్పత్రి బ్లడ్ బ్యాంక్ సిబ్బంది, గూడూరు ఏరియా ఆస్పత్రి బ్లడ్ బ్యాంక్ సిబ్బంది దాతల నుంచి రక్తాన్ని సేకరించడం జరుగుతుందన్నారు.

వెండి ఆభరణాల స్వాధీనం

సూళ్లూరుపేట, ఫిబ్రవరి 18: సూళ్లూరుపేట రైల్వేస్టేషన్‌లో శనివారం రాత్రి 5 కిలోల వెండి ఆభరణాలను రైల్వే పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది. చెన్నై నుంచి సూళ్లూరుపేటకు వచ్చే మెమో రైలులో అనుమతి పత్రాలు, సరైన బిల్లులు లేకుండా తరలిస్తున్న 5 కిలోల వెండి ఆభరణాలను రైల్వే పోలీసులు గుర్తించి పట్టుకొని స్వాధీనం చేసుకొన్నట్లు సమాచారం. రైల్వే పోలీసులు మాత్రం పూర్తి వివరాలు ఇంకా వెల్లడించలేదు.



గూడూరు, సూళ్లూరుపేట బస్టాండ్లలో బస్సుల కోసం వేచివున్న ప్రయాణికులు

సీఎం సభకు బస్సులు... ప్రయాణికుల పాట్లు

గూడూరు, ఫిబ్రవరి 18: అనంతపురం జిల్లాలోని రాప్తాడులో ఆదివారం జరిగిన సీఎం సిద్ధం సభ కోసం ఆర్టీసీ బస్సులను తరలించడంతో ప్రయాణికులు నానాపాట్లు పడ్డారు. గూడూరు డిపోలో 45 బస్సులు ఉండగా 30 బస్సులను సీఎం సభకు తరలించారు. మిగిలిన 15 బస్సులను పరిమిత ప్రాంతాలకు నడిపారు. దీంతో ప్రయాణికులకు సరిపడా బస్సులు లేకపోవడంతో వారు ఇబ్బందులు పడాల్సివచ్చింది. గూడూరు బస్టాండులో వివిధ ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులకు వారి గమ్యస్థానాలకు చేరాల్సిన బస్సులు సరైన సమయానికి రాకపోవడంతో తీవ్ర అవస్థలు పడాల్సివచ్చింది. రైల్వేజంక్షన్ కావడంతో వివిధ ప్రాంతాలకు వెళ్లే వారు రైళ్లలో ఇక్కడికి చేరుకుని తమ గమ్యస్థానాలకు ఆర్టీసీ బస్సుల్లో వెళుతుంటారు. ప్రధానంగా గూడూరు నుంచి నెల్లూరు, తిరుపతి, చెన్నై, వెంకటగిరి, రాపూరు వెళుతుంటారు. అయితే బస్సుల సంఖ్య తగినంత లేకపోవడంతో పాటు రద్దీ పెరగడంతో కూర్చునేందుకు సీట్లు దొరకక ప్రయానికులు తీవ్ర అవస్థలు పడ్డారు. గ్రామీణ ప్రాంతాలకు కూడా బస్సులు లేకపోవడంతో ఆటోలను ఆశ్రయించాల్సివచ్చింది. అదేవిధంగా వాకాడు డిపోలో 40 బస్సులు ఉండగా సిద్ధం సభకు 21బస్సులను తరలించడంతో వాకాడు, కోట ప్రాంతాల ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు

సూళ్లూరుపేట: రాప్తాడులో ఆదివారం జరిగిన సీఎం సిద్ధం సభ కోసం తరలించడంతో సూళ్లూలరుపేట డిపో నుంచి 20 బస్సులను తరలించారు. డిపోలో ఉన్నవే మొత్తం 37 బస్సులు. ఇందులో 12 అద్దె బస్సులు ఉన్నారు. సీఎం సభకు 20 బస్సులు తరలించడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఆదివారం సెలవు దినంతో పాటు పెళ్లిళ్ల సీజన్ కావడంతో సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన ప్రయాణికులు బస్సుల్లేక నానా తంటాలు పడ్డారు. ఆటోలు, ప్రైవేట్ వాహనాల్లో అధిక చార్జీలు చెల్లించి వెళ్లాల్సి వచ్చింది. నెల్లూరు, తిరుపతి నగరాలకు బస్సులు లేకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు.

వెంకటగిరి టౌన్: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో బస్సులు లేక ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అనంతపురం జిల్లా రాప్తాడులో సిద్ధం సభకు వెంకటగిరి డిపో నుంచి 26 బస్సులు తరలివెళ్లడంతో ప్రయాణికులు అవస్థలు పడ్డారు.

రోడ్డుకు తట్టెడు మట్టి వేయలేరా: నెలవల



కొణ్ణంబట్టులో కరపత్రాలు అందజేస్తున్న నెలవల

సూళ్లూరుపేట, ఫిబ్రవరి 18: మరమ్మతులకు గురైన రోడ్లకు తట్టెడు మట్టి వేసేందుకు చేతకాని ప్రభుత్వానికి పాలించే అర్హత లేదని సూళ్లూరుపేట నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం అన్నారు. ఆదివారం మండల పరిధిలోని కొణ్ణంబట్టులో బాబు ష్యూరిటీ - భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటా తిరిగి కరపత్రాలు అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఐదేళ్లు కావస్తున్నా గ్రామీణ ప్రాంతాల్లో రోడ్లకు తట్టెడు మట్టివేసి మరమ్మతులు చేయలేదని విమర్శించారు. ప్రజాస్వామ్యంపై గౌరవం లేని సీఎం జగన్ పాలనకు చమరగీతం పాడే రోజులు దగ్గరపడ్డాయన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచు జనార్దన్, టీడీపీ నాయకులు సుబ్రహ్మణ్యం, బుజ్జయ్య, ప్రదీప్, జానీ, ప్రభాకర్, శ్రీనివాసులు, రేణుక తదితరులు పాల్గొన్నారు.

బాబుతోనే భవిష్యత్తుకు గ్యారెంటీ



ప్రచారం చేస్తున్న టీడీపీ, జనసేన నాయకులు

బాలాయపల్లి, ఫిబ్రవరి 18: మండల పరిధిలోని అంబలపూడిలో వెంకటగిరి నియోజకవర్గ జనసేన సమన్వయకర్త గూడూరు వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ - భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో టీడీపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థిని గెలిపించాలని కోరారు. వైసీపీ ప్రభుత్వం గ్రామాల్లో తాగునీరు, సాగునీరు, డ్రైనేజీ, రోడ్డు వసతులు కల్పించడంలో విఫలమైదన్నారు. కార్యక్రమంలో జనసేన మండల అధ్యక్షుడు పగడాల వెంకటరమణ, వినోద్ కుమార్, రూపేష్, భాస్కర్, నరసింహ, కోటి రాజేష్, మన్మధ, వంశీ, హరి శేఖర్, మహేంద్ర, హర్ష, ప్రభాకర్, లోకేష్, గౌతమ్, కోటి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ విజయానికి కృషి చేద్దాం: మేరిగ

గూడూరు, ఫిబ్రవరి 18: రానున్న ఎన్నికల్లో అందరం కలిసికట్టుగా వైసీపీ విజయానికి కృషి చేద్దామని నియోజకవర్గ కన్వీనర్, ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్‌రావు అన్నారు. ఆదివారం మండలంలోని గోగినేనిపురం సమీపంలోని ఓ కల్యాణమండపంలో గూడూరు మండల నాయకులతో ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించారు. వైసీపీకి చెందిన జీడ్పీటీసీ సభ్యురాలు యామిని, ఆమె భర్త మహేంద్రరెడ్డి గైహాజరు కావడం చర్చనీయాంశంగా మారింది. కార్యక్రమంలో మల్లు విజయ్‌కుమార్‌రెడ్డి, ఎల్లసిరి గోపాలరెడ్డి, పొణకా దేవసేనమ్మ, కోడూరు కల్పలత, కోడూరు మీరారెడ్డి, నరేంద్రరెడ్డి, బొమిడి శ్రీనివాసులు, తాళ్లూరు శ్రీనివాసులు, మగ్దూమ్ తదితరులు పాల్గొన్నారు.

పీఆర్ మినిస్టీరియల్ ఎంప్లాయీస్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా ప్రసన్నకుమార్



ప్రసన్నకుమార్‌ను అభినందిస్తున్న అసోసియేషన్స్ నాయకులు

నాయుడుపేట, ఫిబ్రవరి 18: ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ఉమ్మడి నెల్లూరు జిల్లా శాఖ ఎన్నికలను ఆదివారం నెల్లూరులోని జిల్లా ప్రజాపరిషత్ కార్యాలయంలో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బండి శ్రీనివాసరావు అధ్యక్షతన నిర్వహించారు. జిల్లా ప్రధాన కార్యదర్శిగా నాయుడుపేటకు చెందిన వి.దేవప్రసన్నకుమార్, రాష్ట్ర కౌన్సిలర్‌గా ఆనందబాబు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వీరిని జిల్లా పీఆర్ మినిస్టీరియల్ ఎంప్లాయీస్ అసోసియేషన్ నాయకులు నాయుడుపేట తాలూకా సెక్రటరీ కె.దయాకర్, డిస్ట్రిక్ మెంబరు ఆనందకుమార్, భరణీకుమార్ అభినందించారు.

పీఎస్ మాల్‌కు ఘనంగా భూమిపూజ



తిరుపతి(కొర్లగుంట), ఫిబ్రవరి 18: ఎమ్మార్‌పల్లిలో పంగులూరి సీతమ్మ వాణిజ్య భవన సముదాయ నిర్మాణానికి ఆదివారం భూమి పూజ నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే, టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి, మేయర్ డాక్టర్ శిరీష, ఎంపీ గురుమూర్తి, ఉప మేయర్ భూమన అభినయ్ పాల్గొన్నారు. తమ సహాయ సహకారాలు అందిస్తామని, ఈ ప్రాంతం అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. తొలివిడతగా ఐదు అంతస్తులతో విశాలమైన భవన సముదాయం నిర్మిస్తున్నారు. సీతమ్మ భూముల అభివృద్ధికి ఆర్యవైశ్యులు ముందుకు రావాలని, వీలునామాలో ఉన్న విధంగా అభివృద్ధి చేసేందుకు కట్టుబడి ఉన్నామని కన్యకాపరమేశ్వరి ఆలయ అధ్యక్షుడు పామిడి సత్యనారాయణ, ఉపాధ్యక్షుడు దిండుకుర్తి నరసింహులు, కార్యదర్శి కొండూరి మహేష్ వివరించారు. ఈ కార్యక్రమంలో గుబ్బా చంద్రశేఖర్, ముర్రం శెట్టి రాములు, మువ్వల నరసింహులు, శిరీష, కామిశెట్టి శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

గంగమ్మకు నెలపొంగళ్లు

చిల్లకూరు, ఫిబ్రవరి 18: స్థానిక చెన్నకేశవ ఆలయం సమీపంలో కొలువైన గంగమ్మ ఆలయం వద్ద ఆదివారం భక్తులు నెలపొంగళ్లు పెట్టారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి పొంగళ్లు పెట్టి నైవేద్యంగా నివేదించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

ముత్యాలమ్మకు పూజలు

చిల్లకూరు, ఫిబ్రవరి 18: మండలంలోని తూర్పుకనుపూరు గ్రామంలో వెలసిన ముత్యామ్మకు ఆదివారం ప్రత్యేక పూజలు జరిగాయి. పలు ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు ఆలయం వద్ద పొంగళ్లు పెట్టారు. అనంతరం అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

కళాశాల అభివృద్ధికి కృషి



సమావేశంలో పూర్వ విద్యార్థులు

గూడూరు, ఫిబ్రవరి 18: ప్రభుత్వ సిరామిక్ కళాశాల అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామని సిరామిక్ కళాశాల పూర్వ విద్యార్థుల అసోసియేషన్ అధ్యక్షుడు చంద్రమోహన్ అన్నారు. ఆదివారం కళాశాలలో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థానాలకు చేరుకోవాలన్నారు. ఈ కళాశాలలో చదవడం ద్వారా తాము ఉన్నత స్థితిలో ఉన్నామని, తమ అభివృద్ధికి దోహదం చేసిన కళాశాలలో మెరుగైన వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఇక్కడ చదువుకుని వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన వారందరూ ఒకే వేదికపై కలలుసుకోవడం ఆనందంగా ఉందన్నారు. కళాశాల తొలి ప్రిన్సిపాల్ ఎల్ఆర్ ప్రసాద్‌ను సన్మానించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సత్యనారాయణరావు, విశ్రాంత ప్రిన్సిపాల్ సుబ్బారావు, సుబ్రహ్మణ్యం, శ్రీనివాసరావు, పాండు, నరసింహులు, అరుణ్‌కుమార్, రామకృష్ణ, వెంకటేష్, విజయలక్ష్మి, జాలేంద్ర, కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైనది



అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న డీసీవో తదితరులు

కోట, ఫిబ్రవరి 18: ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైనదని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులాల చిత్తూరు, తిరుపతి జిల్లాల కోఆర్డినేటర్ జయభారతి అన్నారు. కోటలోని అంబేడ్కర్ గురుకులం ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్న మేరీ విజయకుమారి, అటెండర్ ఆవుల నారాయణరావు ఉద్యోగ విరమణ సభ ఆదివారం జరిగింది. వారిని డీసీవో జయభారతి, ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు, సిబ్బంది పూలమాలలు, షీల్డ్‌లతో అభినందించారు. మేరీ విజయకుమారి సేవలను డీసీవో కొనియాడారు. అనంతరం స్థానిక అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పలు గురుకులాల ప్రిన్సిపాళ్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కోటమ్మకు పూజలు

కోట, ఫిబ్రవరి 18: కోట గ్రామదేవత కోటమ్మకు ఆదివారం విశేషపూజలు జరిగాయి. అమ్మవారి మూలవిరాట్‌కు అభిషేకాలు చేసి ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు.

పేదలకు దుస్తుల పంపిణీ

నాయుడుపేట, ఫిబ్రవరి 18: నాయుడుపేటలో పేదలకు 786 సేవాసంఘం అధ్యక్షుడు షేక్ రఫీ జన్మదినం సందర్భంగా సభ్యులు ఆదివారం దుస్తుల పంపిణీ, అన్నదానం చేశారు.

ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్‌పై దాడి అమానుషం

డక్కిలి, ఫిబ్రవరి 18: అనంతపురం జిల్లా రాప్తాడులో జరిగిన సిద్ధం సభలో ఆంధ్రజ్యోతి ఫొటో గ్రాఫర్ శ్రీకృష్ణపై వైసీపీ మూకలు దాడిచేయడం అమానుష చర్య అని టీడీపీ నాయకులు అన్నారు. టీడీపీ జాతీయ ఉపాధ్యక్షుడు వెంపటి మాధవనాయుడు, తెలుగు యువత రాష్ట్ర ఉపాధ్యక్షుడు కేవీకే ప్రసాద్ నాయుడు, డక్కిలి మాజీ ఎంపీపీ పోలంరెడ్డి వెంకటరెడ్డి, మాజీ జడ్పీటీసీ ఏలేశ్వరం రామచంద్రయ్య నాయుడు, టీడీపీ మండల అధ్యక్షుడు పోలంరెడ్డి కోటేశ్వరరెడ్డి తదితరులు ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్‌పై జరిగిన దాడిని ఖండించారు. వైసీపీ రాక్షస పాలకు ఈ ఘటన అద్దం పడుతోందన్నారు. నిందితులపై పోలీసులు హత్యాయత్నం కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.

చెంగాళమ్మకు బంగారు కాసుల దండ



కాసుల దండను అందజేస్తున్న భక్తులు

సూళ్లూరుపేట, ఫిబ్రవరి 18: సూళ్లూరుపేటలోని చెంగాళమ్మ పరమేశ్వరికి పట్టణానికి చెందిన నన్నం ఏడుకొండల కుటుంబ సభ్యులు 95 గ్రాముల బంగారు కాసుల దండను విరాళంగా ఆదివారం అందజేశారు. అదేవిధంగా శ్రీసిటీకి చెందిన శంకర్ 7 గ్రాముల బంగారు తాళిబొట్టు, నల్లపూసల దండను ఆలయ చైర్మన్ దువ్వూరు బాలచంద్రా రెడ్డి సమక్షంలో ఈవో దబ్బుగుంట వెంకటేశ్వర్లుకు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాలక మండలి సభ్యుడు ముప్పాళ్ల చంద్రశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు

పెళ్లకూరు, ఫిబ్రవరి 18: గ్రామాల్లో తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఎంపీపీ పోలంరెడ్డి శేఖర్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా పంచాయతీల్లో ప్రజాప్రతినిధులు చొరవచూపాని కోరారు.

విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు



విద్యార్థికి మెమెంటో అందజేస్తున్న శ్రీనివాసులురెడ్డి

నాయుడుపేట టౌన్, ఫిబ్రవరి 18: విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు లభిస్తుందని శ్రీవేమ విద్యాసంస్థల అధినేత పెమ్మారెడ్డి శ్రీనివాసులురెడ్డి అన్నారు. శ్రీవేమ జూనియర్ కళాశాల వార్షికోత్సవం ఆదివారం నిర్వహించారు. విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో సీవీ రామన్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ గాదిరెడ్డి గోపీ, విద్యాకేంద్ర పాఠశాల ప్రిన్సిపాల్ రామిరెడ్డి, కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆమ్‌ఆద్మీ పార్టీతోనే సంక్షేమం



ప్రచారం చేస్తున్న ఆమ్‌ఆద్మీ పార్టీ సభ్యులు

నాయుడుపేట, ఫిబ్రవరి 18: ఆమ్‌ఆద్మీ పార్టీతోనే సంక్షేమం సాధ్యమని ఆ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు పాలేటి వెంకటస్వామి అన్నారు. నాయుడుపేటలో ఆదివారం పార్టీ కార్యకర్తలతో కలసి ప్రచారం నిర్వహించారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, సున్నా వడ్డీ రుణాలు, రైతులకు పావలా వడ్డీ రుణాలు, గిట్టుబాటు ధర, యువతకు ఉపాధి కల్పనే ఆమ్‌ఆద్మీ పార్టీ ధ్యేయమని చెప్పారు. కార్యక్రమంలో పట్టపు రవి, బల్లి రంగయ్య, మానస, ఆదెమ్మ, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

బర్డ్ ఫ్లూ ఎఫెక్ట్.. చికెన్ షాపులు వెలవెల



కొనుగోలుదారులు లేక ఖాళీగా ఉన్న చికెన్ దుకాణం

సూళ్లూరుపేట, ఫిబ్రవరి 18: ఉమ్మడి నెల్లూరు జిలాల్లో బర్డ్ ఫ్లూ వైరస్ వ్యాపించడంతో సూళ్లూరుపేట పట్టణంలో ఆదివారం చికెన్ షాపులు వెలవెలపోయాయి. బర్డ్ ఫ్లూ చికెన్ తినకూడదంటూ నెల్లూరు పట్టణంలో చికెన్ దుకాణాలను అధికారులే మూసివేయించారు. సూళ్లూరుపేటలో కొనుగోలుదారులు రాకపోవడంతో చికెన్ దుకాలన్నీ బోసిపోయాయి. అదేసమయంలో చేపల మార్కెట్, మటన్ కొట్టుల వద్ద కొనుగోలుదారులు బారులు తీరారు.

కాలినడకన తిరుమలకు శ్రీలీల



తిరుమల, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): సినీ హీరోయిన్ శ్రీలీల శ్రీవారి దర్శనార్థం ఆదివారం కాలినడకన తిరుమలకు వచ్చారు. రాత్రి 7 గంటలకు అలిపిరిలో కుటుంబ సభ్యులతో కలిసి బయలుదేరి తిరుమలకు చేరుకున్నారు. జీఎంఆర్ అతిథి గృహంలో బస చేశారు. సోమవారం ఉదయం శ్రీవారిని దర్శించుకోనున్నారు.